


ఆ రోజు 'ఆనందనిలయం' తన ఐదవ వార్షికోత్సవం జరుపుకుంటూవుంది. ఐదేళ్ళనాడు ఇద్దరు అనాథలతో ప్రారంభం అయిన ఆ నిలయంలో ఇప్పుడు ఇరవై మంది దాకా వున్నారు. వందమందికైనా వసతి కల్పించగల ఆ విశాలమైన భవనం, విజయవాడ వెళ్ళే రోడ్డు పక్కగా ఓ చిన్నగుట్టపైన వుంది.

ఆ భవనం నవాబుల గత వైభవాన్ని చాటి చెబుతుంది. ఆ భవనం అసలు రంగు ఏమిటో తెలుసుకోవడం కష్టం. బయటి గోడలు నల్లగానూ, లోపలిభాగం నలుపూ తెలుపూ కాని చిత్రమైన రంగులోనూ వున్నాయ్.

ఆ భవనం యజమాని పాకిస్తాన్ పారిపోయాడట. అతని వారసులం అని చెప్పుకొనే వారి దగ్గర ఆనంద బాబా దాన్ని అతి చౌకగా కొన్నాడు. ఆ తర్వాత వచ్చిన లిటిగెంట్స్ నుంచి తన పరపతిని ఉపయోగించి తేలిగ్గానే బయట పడ్డాడు.

పతిత స్త్రీల ఉద్ధరణకై కంకణం కట్టుకున్న ఆనందరావు 'ఆనంద నిలయం' స్థాపించి 'ఆనందబాబా'గా మారిపోయాడు. ఆ బిరుదు అతనికి ఎవరూ ఇవ్వలేదు. తనే తన పేరు మార్చుకున్నాడు. ఆ పేరుతోనే మంచి పలుకుబడి సంపాదించుకున్నాడు. ఈరోజు 'ఆనందబాబా' తెలియని వాళ్ళు ఆ నగరంలోనే లేరంటే అతిశయోక్తికాదు.

ఒకేరకమైన దుస్తుల్లో వున్న ఆడపిల్లలు కూడా విడిగా పనులుచేస్తున్నారు.

భవనం ముందు వున్న విశాలమైన ఆవరణంలో వేదిక తయారైంది. రంగు రంగుల కాగితపు తోరణాలు కట్టారు. వేదికను కస్తూరిబా, సరోజినీ నాయుడూ, ఇందిరాగాంధీల ఫోటోలతో అలంకరించారు.

“విమలా! ఫ్లవర్ వాజ్ తెచ్చి ఆ టేబుల్ మీద పెట్టు.”

“అనసూయా! ఆ కుర్చీ ఇక్కడ వెయ్!”

“అరే ఆదేమిటి! ఆ పాత టేబుల్ క్లాత్ వేశారు. కొత్తది బీరువాలో వుంది. తెచ్చి వెయ్యి సావిత్రీ!”

ఆ నిలయంలో అందరి ఆలనా పాలనా చూసే పెద్దమ్మ (ఆమెను అందరూ అలాగే పిలుస్తారు) పనులు పురమాయిస్తుంది. ఆమె పేరు మిసెస్ వైకుంఠం.

హడావిడిగా తిరుగుతూ పనులు చేస్తున్న ఆడపిల్లల్లో కొందరు ఉత్సాహంగా వున్నారు. కొందరు ఏ భావంలేని యంత్రాలుగా వున్నారు. కొందరు బెరుకుబెరుకుగా వుండటం వల్ల, చూడగానే కొత్తగా వచ్చివుంటారని తెలిసి పోతూవుంది. అందులో కొందరు ఏంచెయ్యాలో తెలియక తికమక పడుతున్నారు. కొందరి కళ్ళల్లో దిగులు కొట్టవచ్చినట్టు కన్పిస్తూ వుంది.

నాగేంద్రం, వెంకటేశ్వర్లూ కుర్చీలు వేస్తున్నారు.

“ఇంకా పూర్తికాలేదూ!” ఆనందబాబా వచ్చారు.

ఆయనను చూడగానే అమ్మాయిలంతా సవినయంగా నమస్కరించారు.

మిసెస్ వైకుంఠం ముసిముసిగా నవ్వుతూ, పైట సర్దుకుంటూ “ఆ! అంతా అయినట్టే!” అన్నది.

“ఒరేయ్ నాగూ!”

“ఏంటి బాబూ!” అంటూ నాగేంద్రం చేతిలో పని వదిలేసి ఆనందబాబా ముందు వొచ్చి నిలబడ్డాడు.

“శేషాచలం పురాణం చెప్పడానికి వస్తానన్నాడా!”

"ఆ! వచ్చేస్తాడు. ఐదు గంటలకే వస్తానన్నాడు." అంటూ వెళ్ళి తన పనిలో మునిగిపోయాడు నాగేంద్రం.

ఆనందబాబా ఆడపిల్ల లందర్నీ పరిశీలనగా చూశాడు. లెక్క పెట్టాడు. లెక్కకు ఒక పిల్ల తక్కువైంది. "పందొమ్మిది మందే వున్నారేం?" మిసెస్ వైకుంఠం కేసి చూశాడు.

"ఆ కొత్త పిల్ల గదిలో ఏడుస్తూ కూర్చుంది. బయటికి రానంటుంది." అన్నది మిసెస్ వైకుంఠం.

"నాలుగు రోజులైనా ఇంకా అలవాటు పడలేదన్న మాట?"

"పల్లెటూరి పిల్ల మరి! — టైం పడుతుంది!" అదోలా చూస్తూ అన్నది మిసెస్ వైకుంటం.

"నేను వెళ్తున్నాను. మంత్రిగార్ని తీసుకొస్తాను నువ్వే అన్ని విషయాలూ చూసుకో. ఆ కొత్త పిల్లను కూడా తీసుకొచ్చి కూర్చోబెట్టు," అంటూ ఆనందబాబా వడివడిగా బయటికి వెళ్ళి కారులో కూర్చున్నారు.

ఆనందబాబాకు బోడిగుండులేదు. మెళ్ళో రుద్రాక్షలు లేవు కాషాయ వస్త్రాలు లేవు. వృద్ధుడు అంతకంటే కాదు.

ఏభయ్యో పడిలోవున్న ఆనందబాబా ఖద్దరు పంచ ధరిస్తారు. అయితే మోకాళ్ళ వరకే ధరిస్తారు. చొక్కా వేసుకోరు. ఖద్దరు ఉత్తరీయం రెండు భుజాలమీదుగా కప్పుకుంటారు. అటుగుండూ, ఇటు క్రాపూ కాని జుట్టు మధ్య వెనగ్గా చిన్న ముడి వేసుకున్న పిలక వుంటుంది.

కండ పుష్టిగల వచ్చటి విగ్రహం.

అతను సన్యాసి కాడు. సంసారం వుంది. భార్యా, పిల్లలు వున్నారు. పెద్ద కూతుర్ని ఐ. ఏ. యస్. ఆఫీసరుకు ఇచ్చి పెళ్ళిచేశాడు. చాటుగా కట్నం చాలా ముట్టచెప్పాడంటారు గిట్టనివాళ్ళు. ఆయనతో వియ్యం మందటమే మహా భాగ్యంగా తలచి ఆ అబ్బాయి ఈ వివాహం చేసుకున్నాడంటారు ఆయన సన్నిహితులు. దూషణ భూషణల్ని సమంగా స్వీకరించే బాబాగారు మాత్రం దేనికీ సమాధానం ఇవ్వరు. చిద్విలాసంగా నవ్వి మౌనం వహిస్తారు.

ఆనందబాబా పెద్ద కుమారుడు అమెరికాలో చదువుతున్నాడు. చిన్న కొడుకూ, చిన్న కూతురూ మెడిసిన్ చదువుతున్నారు.

పట్టణం నడిబొడ్డున బాబాగారికి పెద్ద భవంతే వుంది. ఐదు సంవత్సరాలకు ముందు అతను ఏం చేశేవాడో ఎవరికీ తెలియదు. ఇప్పుడు కూడా అనాధసేవకు మించి మరో పని చెయ్యడం ఎవరికీ తెలియదు. అతను ధనవంతుడని మాత్రం అందరికీ తెలుసు.

మిసెస్ వైకుంఠం సహాయ సహకారాలతో ఆనంద నిలయం అభివృద్ధిలోకి వచ్చింది. ఇద్దరితో ప్రారంభించిన ఆ నిలయంలో ఎప్పుడూ పదిహేనుమందికి తక్కువగా వుండరు. వచ్చేవాళ్లు వస్తూవుంటే, వున్నవాళ్ళకు పెళ్ళిళ్లు చేసి పంపిస్తూ వుంటారు.

జనం ఒక్కొక్కరే వస్తున్నారు ప్రముఖులకు మిసెస్ వైకుంఠం ఎదురువెళ్ళి స్వాగతం చెబుతూవుంది.

క్రమంగా కుర్చీలన్నీ నిండిపోయాయి.

పూల పళ్లాలు పట్టుకొని అమ్మాయిలు రెండుబారులుగా తీరి గేటుముందు నిల్చుని వున్నారు.

కారు వచ్చి ఆగింది.

"వచ్చారు. వచ్చేశారు." జనంలో కలకలం.

మిసెస్ వైకుంఠం తన లావుపాటి పొట్టి శరీరాన్ని దొర్లించుకుంటూ ముందుకు పరుగుతీసింది.

బాబా వెనకే మంత్రిగారు కారుదిగారు. బారులు తీరి నిల్చున్న అమ్మాయిల్ని చూసి చిరునవ్వుతో పలకరించారు మంత్రిగారు

ఆ అమ్మాయిలు మంత్రిగారి మీద పూలు చల్లుతూ పాటతో స్వాగతం చెప్పారు.

మినిష్టర్ గారిని సోఫాలో ఆసీనుల్ని చేసి ఆనందబాబా వేదికపైకి వచ్చారు మైకు ముందు నిలబడ్డారు.

"సోదర సోదరీ మణులారా! ఈరోజు 'ఆనందనిలయం' తన ఐదవ వార్షికోత్సవం జరుపుకుంటూ వున్నదని చెప్పడానికి గర్విస్తున్నాను. ఈ శుభసమయంలో గౌరవనీయులూ, అమాత్య శేఖరులూ అయిన శ్రీ శ్రీ గురవయ్యగారు విజయం చెయ్యడంవల్ల ఈ 'ఆనందనిలయా' నికి గౌరవం పెరిగింది (జనంలో కరతాళధ్వనులు). వారిని అధ్యక్షాసనం అలంకరించవలసిందిగా కోరుతున్నాను.

కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. గురవయ్యగారు లేచి ఖద్దరు కండువా సర్దుకుంటూ వేదికపైకి వచ్చారు. సభాసదులకు వినయంగా నమస్కరించి కూర్చున్నారు.

అంత వినయంగా మంత్రిగారు నమస్కరిస్తూ వుంటే ప్రేక్షకుల్లోని అనేకులు ఉబ్బిపోయారు.

మిసెస్ వైకుంఠం తనకంటే పొడవుగావున్న గులాబీ మాలను అతికష్టంమీద పైకి ఎత్తి మంత్రిగారికి వేసింది.

మరో పూలదండ బాబా వారిస్తున్నా, వినిపించుకోకుండా ఆయన మెడలో వేసింది.

ఆనందబాబా శరణాలయం గురించి పరిచయం చెయ్యసాగారు

"మన భారతదేశం ఒకప్పుడు ధర్మక్షేత్రంగా ప్రసిద్ధి




కెక్కింది. మన దేశం పవిత్రతకూ, ధర్మానికీ, పాతివ్రత్యానికీ ఒకనాడు నిలయం. కాని ఈ రోజు... ఎక్కడ చూసినా అధర్మం, అన్యాయం... దుష్టత్వం... ప్రబలిపోతున్నాయి. ఈ ఇంగ్లీషు చదువులవల్ల యువతరం పాడైపోయింది. ఎవరికీ హిందూ ధర్మంమీదా, ఆర్ష సాంప్రదాయం మీదా విశ్వాసంలేదు. గౌరవంలేదు. ఒకప్పుడు సుమతీ, సావిత్రీ, అనసూయలవంటి మహా పతివ్రతలను కన్న పుణ్యభూమి మన దేశం. (జనంలో కరతాళధ్వనులు వేదికమీద కూర్చుని ముందుగా చప్పట్లు కొట్టింది మిసెస్ వైకుంఠమే. అనేక చేతులు ఆమెను అనుకరించాయి.)

ఒక్క క్షణం ఆగి మళ్ళీ ప్రారంభించాడు "కాని... ఈనాడు ఆ పతివ్రతలు ఏరీ? ఎందుకు లేరు? ఎక్కడ చూసినా పతితలే కన్పిస్తున్నారేం? (మళ్ళీ చప్పట్లూ - నవ్వులూ).

ఇది నవ్వవలసిన విషయంకాదు. సోదరులారా! దుఃఖించవలసిన విషయం. ధర్మక్షేత్రమైన మన భారత భూమి అధర్మక్షేత్రంగా మారింది. మళ్ళీ మన దేశాన్ని ధర్మక్షేత్రంగా మలచుకోవలసిన బాధ్యత మనందరి మీదావుంది. అందుకు మొదటగా చెయ్యవలసిన కృషి — పతిత స్త్రీ జనోద్ధరణ. వాళ్లను పాప పంకిలం నుంచి ఉద్ధరించాలి. మన దేశంలో ఇలాంటి స్త్రీల సంఖ్య లక్షల్లో వుంది.

"మరి చెడిపోయిన మగాళ్లను ఉద్ధరించ నక్కర్లేదా?" జనంలో నుంచి ఎవరో అరిచారు.

"శాంతించండి! శాంతించండి!" మిసెస్ వైకుంఠం రెండు చేతుల్నీ పైకి కిందకూ గరుత్మంతుడి రెక్కల్లా ఊపుతూ అన్నది.

మళ్ళీ బాబాగారు ప్రారంభించారు— "ఉదాత్త భక్తిగా ఈ నిలయంలో. స్త్రీ జనోద్ధరణ జరుగుతూవుంది. అదే మా లక్ష్యం. మా ధ్యేయం. రోజూ ఉదయం భగవద్గీతా పారాయణం జరుగుతుంది. వారానికి ఒకరోజు శేషాచలం గారు పురాణం చెబుతారు. హిందూ ధర్మంమీదా, ఆర్ష సాంప్రదాయం మీదా భక్తి గౌరవాలు ఇక్కడ ఆశ్రయం పొందిన స్త్రీలలో కలిగిస్తున్నాం. వారికి అగ్ని సాక్షిగా వివాహాలు జరిపించి పునీతుల్ని చేసే కృషి చేస్తున్నాం. ఇదంతా మీ అందరి సహాయ సహకారాల వల్లనే చెయ్య గలుగుతున్నాం. ఈ శుభసమయంలో మీకు తోచింది దానంగా ప్రకటించి పతిత జనోద్ధరణకు సహాయపడి, మీ ఔదార్యాన్ని ప్రకటించవలసిందిగా కోరుతున్నాను. ఇప్పుడు సెక్రటరీగారు రిపోర్టు చదువుతారు." అని చెప్పి బాబాగారు కూర్చున్నారు.

మిసెస్ వైకుంఠం కుర్చీనిండుగావుంది. పొట్టికావడంవల్ల కాళ్లు కింద ఆనడంలేదు. ముందుకు జరిగి, చిన్నగా కాళ్లు నేలకు ఆనించి, అతిప్రయాస మీద కుర్చీ దిగింది. మూడు సున్నాలు చుట్టినట్టు కన్పించే ఆమె వేదిక మీద గునగున నడుస్తూవుంటే చాలా మందికి నవ్వువచ్చింది.

"గత సకవత్సరం ఆదాయంకంటే ఐదువేలు ఖర్చు అదనంగా అయింది. ఈ ఐదువేలూ బాబాగారే భరించారు." (మంత్రిగారు చప్పట్లు కొట్టారు. జనం అనుసరించారు. బాబాగారు వినయంగా తల వాల్చుకున్నారు).

"సంవత్సరం పొడుగునా చేర్చుకున్నవాళ్ల సంఖ్య మూడు వందలు. ఇరవైఐదు మందికి వివాహాలు జరిపించాం."

"ఇప్పుడు వున్నది ఇరవై మందేగా? మిగతా వాళ్లేమయ్యారు?" ఒక యువకుడు జనం మధ్య లేచి నిల్చుని ప్రశ్నించాడు.

మిసెస్ వైకుంఠం గాభరాగా బాబాగారికేసి చూసింది.

"కొందర్ని బాగు చెయ్యాలన్నా బాగుపడరు. చెప్పకుండా పారిపోతారు." అన్నారు బాబాగారు

"పారిపోయిన వాళ్లెంత మందో చెప్తారా?"

"నువ్వేమిటయ్యా మధ్యలో?" జనంలో కొందరు అరిచారు.

నాగేంద్రం ఆ యువకుణ్ణి బలవంతంగా బయటికి లాక్కెళ్లాడు.

ఎన్ని పెళ్ళిళ్లు చేసింది, ఒక్కొక్క పెళ్ళికి ఎంత ఖర్చయిందీ, నెలకు సరాసరి ఖర్చు ఎంత అవుతుందీ మొదలైన వివరాలు చదివి వినిపించి కూర్చుంది మిసెస్ వైకుంఠం.

"ఇప్పుడు మంత్రిగారు తమ అమూల్య సందేశం ఇస్తారు." అన్నారు బాబా.

మంత్రిగారు లేచి మైకు ముందుకువచ్చి నిలబడ్డారు.



జాలిగా ఓసారి ఎదురుగా చాపలమీద కూర్చునివున్న స్త్రీల కేసి చూశారు. కంఠం సవరించుకున్నారు. ఉపన్యాసం ప్రారంభించారు.

"మహాజనులారా! ఇప్పుడు బాబాగారు చెప్పినట్టు ఒకప్పుడు మన పవిత్ర భారత భూమి పతివ్రతలను కన్నది. సీతా, సావిత్రీ, అనసూయా ఈ గడ్డమీదే జన్మించారు. కాని ఈనాడు వారు ఏరీ! లేరు ఉండరు. ఈ గడ్డమీద పాపం పెరిగిపోయింది."

"అవును! అందుకు కారణం మీ మంత్రులే!" జనంలోంచి కేక విన్పించింది.

బాబా గాభరాగా నాగేంద్రంకేసి చూశారు. నాగేంద్రం మరో యువకుడిని బయటికి లాక్కెళ్ళాడు.

మంత్రిగారు అదేమీ పట్టనట్టే మాట్లాడసాగారు. (ఇటువంటివి పట్టించుకుంటే మంత్రులు పాపం ఉపన్యాసాలేం ఇవ్వగలరు?)

"ఈనాడు ఆడపిల్లలు అనాధలుగా, పతితలుగా నడి బజారు పాలు అవుతున్నారు. అలాంటివారి ఉద్ధరణకు ఇటువంటి ఆశ్రమాల అవసరం ఎంతైనా వుంది. ఆనంద బాబాగారు అనాథ పతిత స్త్రీల ఉద్ధరణ కొరకు తమ జీవితాన్నే అంకితం చేశారు. (జనంలో కరతాళ ధ్వనులు)

మంత్రిగారు ఉపన్యాసం ముగిస్తూ "ఈ శుభసమయంలో ఈ ఆనంద నిలయానికి నేను వెయ్యి రూపాయలు విరాళంగా ఇస్తున్నాను" అన్నారు.

ఆనంద బాబాతోపాటు అందరూ వాతావరణం దద్దరిల్లేలా చప్పట్లు కొట్టారు.

"మీరందరూ కూడా మీకుతోచింది ఇప్పుడే ఇవ్వమని నా మనవి." అని విన్నపం చేసి కూర్చున్నారు మంత్రిగారు.

పురాణం చెప్పడానికివచ్చి ముందు వరసలో కూర్చున్న శేషాచలం లేచి "నావంతు ఐదువందలు రూపాయలు వేసుకోండి. రేపు పంపిస్తాను," అన్నాడు.

బాబా శేషాచలం ధర్మబుద్ధిని పొగిడేశారు. మొత్తంమీద అక్కడికక్కడ ఐదువేల రూపాయల వరకు వసూలైంది.

సభ ముగిసింది.

లేస్తున్న జనాన్ని కూర్చోబెడుతూ "సోదరులారా! కూర్చోండి. ఇంతకు ముందే ఐదువందలు విరాళం ఇచ్చి తన ధర్మబుద్ధిని చాటిచెప్పుకున్న శేషాచలంగారు పురాణం చెప్తారు. వారి పురాణ కాలక్షేపం ప్రాశస్త్యాన్ని గురించి వినని వారు మీలో వుండరనే అనుకుంటాను. కూర్చోండి. అని అనౌన్స్ చేసి వేదిక దిగి మంత్రిగార్ని పంపించి రావడానికి వెళ్ళారు బాబాగారు.

శేషాచలం ఆనాడు పురాణంలో 'అహల్యా శాపం' గురించిన ఘట్టం వినిపించాడు. దాంతోపాటు స్త్రీకి పాతివ్రత్యం ఎంత ముఖ్యమో చెప్పాడు. దారి తప్పిన స్త్రీల బ్రతుకులు ఎలా బండల పాలౌతాయోకూడా చెప్పాడు. శేషాచలం చాలా ఉత్సాహంగా రెండు గంటల పురాణం వినిపించి, తన స్నేహితుడు వీరభద్రయ్యతో ఇంటికి బయలుదేరాడు.

"నువ్వెన్నన్నా చెప్పుగాని వాళ్ళను చూస్తుంటే నా గుండెలు తరుక్కుపోయాయి." అన్నాడు వీరభద్రయ్య.

"ఎందుకూ? కర్మ ఫలితం అనుభవించ వద్దూ?" అన్నాడు శేషాచలం.

పారమార్థిక చింతగల శేషాచలానికి అవినీతి అంటే అసహ్యం. దొంగతనం అంటే, మోసం అంటే రోత. రంకుతనం అంటే ఇక చెప్పనే అక్కర్లేదు. ఆ మాట వింటూనే "రామ! రామ!" అంటూ చెంపలు వేసుకుంటాడు.

అందుకే శేషాచలానికి ఆనందనిలయంలోని అమ్మాయిలంటే సానుభూతి లేదు. ఇలాటి ఆడవాళ్ళ వల్లే దేశం మరీ పాడయిపోయిందని ఆయన బాధ.

"ఏమిటాలోచిస్తున్నావ్? అందులో ఎవరిమీదో నీ కన్ను పడ్డట్టువుంది. నీ మెతక బుద్ధి గురించి నాకు తెలియదా ఏం?" అన్నాడు శేషాచలం.


"రామ! రామ! ఎంతమాట అన్నావయ్యా!" అంటూ నడక వేగం హెచ్చించాడు వీరభద్రయ్య.

## 2

అనసూయను అందరూ ముస్తాబు చేశారు. మిసెస్ వైకుంఠం లోపలకు వచ్చింది. అనసూయను ఎగాదిగా చూసి చిరునవ్వు నవ్వింది.

అనసూయ ఎందుకో దిగాల్గా వుంది.

"ఎంతో బాగున్నావ్. ఈసారికి మాట దక్కించు." అంటూ గడ్డం పట్టుకుంది మిసెస్ వైకుంఠం.




"పెద్దమ్మా నాన్నగారు పిలుస్తున్నారు." అంటూ నాగేంద్రం వచ్చారు.

అక్కడ అందరూ ఆనందబాబాను నాన్నగారు అనీ, మిసెస్ వైకుంఠాన్ని పెద్దమ్మ అనీ పిలుస్తారు.

"పెళ్ళి కొడుకు పిసినారిగానే వున్నాడు... మరి ఎలా..."

అనసూయ నాగేంద్రం ముఖంలోకి చురచుర చూసింది.

"నాకిదేం నచ్చలేదు. నువ్వు కూడా నాటకం ఆడుతున్నావ్. నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పి..."

"ఉష్! మాట్లాడకు పెద్దమ్మ వస్తున్నట్టుంది." అంటూ నాగేంద్రం గదినుంచి బయటికి వెళ్ళిపోయాడు.

అనసూయ అలా వెళ్ళిపోతున్న నాగేంద్రంకేసి కోపంగా చూస్తూ వుండిపోయింది.

ఆఫీసుగదిలో ఆనందబాబాతో వీరభద్రయ్య కూర్చుని మాట్లాడు తున్నాడు.

"నా బిడ్డలా పెంచాను. జాగ్రత్తగా చూసుకోవాలి. ఏ మాత్రం బాధకలిగినా నేను సహించలేను." అన్నారు ఆనందబాబా.

"ఎంత మాట! ఎంత మాట! నా ప్రాణంగా చూసుకుంటాను." అంటూ వాకిలికేసి చూశాడు వీరభద్రయ్య.

"డబ్బు తెచ్చారా?''

''తెచ్చాను."

ఐదువేల రూపాయలకట్టలు బాబాముందు పెట్టాడు.

లెక్కపెట్టుకొని "మరి పెళ్ళిఖర్చులు?'' అన్నారు ఆనందబాబా.

"పెళ్ళి సింపుల్‌గా కావాలన్నానుగదండీ. రెండుమాలలు వేసుకుంటే చాలన్నానుగా?"

''అదే లేవయ్యా! దండల పెళ్ళేలే. కాని నిలయంలో వున్న ఆడపిల్లలందరికీ ఈ శుభసమయంలో విందుభోజనం అయినా పెట్టక్కర్లేదా? ఇంత పిసినిగొట్టువు. పిల్లను ఏం సుఖపెడతావ్?" అన్నారు బాబా.

వీరభద్రయ్య గతుక్కుమన్నాడు.

''ఎంత ఇవ్వమన్నారు," నసుగుతూ అడిగాడు వీరభద్రయ్య.

''వెయ్యి రూపాయలైనా అవుతుంది."

'వెయ్యే!" నోరు వెళ్ళబెట్టాడు.

"ఏభై ఏళ్లు దాటిన నీకు పెళ్ళి కావాలి. అందాలబొమ్మ కావాలి. ఆ బొమ్మ చౌకగా రావాలి. అంతేనా'' తీవ్రంగా వుంది బాబా కంఠం.

వీరభద్రయ్య మారుపలక్కుండా వెయ్యిరూపాయలు తీసి లెక్కపెట్టి బాబాకు అందించాడు.

పూలదండల పెళ్ళి జరిగింది. అనసూయ నిలయంవదిలి వీరభద్రయ్య వెనకేవచ్చి ఆటోలో కూర్చుంది. అనసూయ ముఖంలో విచారంలేదు. సంతోషంకూడా లేదు. నిర్లిప్తంగా వచ్చి కూర్చుంది.

"కొంచెం కూడా సిగ్గుపడదేం?" అనుకున్నాడు అరవయ్యోపడిలో పడుతున్న వీరభద్రయ్య.

## 3

ఆరోజు మధ్యాహ్నంనుంచీ కుండపోతగా వర్షం కురుస్తూ వుంది. ఆరుదాటింది. చీకటి చీకటిగా వుంది.

వర్షం తగ్గుముఖం పట్టింది.

రోడ్డుపక్క కాలవల్లోకి ప్రవహిస్తున్న వర్షపునీటి శబ్దం సన్నగా వినిపిస్తూంది.

శేషాచలం పిచ్చెక్కినట్టు ఇంట్లోకి వసారాలోకి తిరుగుతున్నాడు.

శ్రోతల్లో ముఖ్యుడైన వీరభద్రయ్య వారంరోజులుగా పురాణం వినడానికి రావడంలేదు.


శేషాచలానికి వీరభద్రయ్య రాకపోవడానికి కారణం ఆ రోజే తెలిసింది.

ఆరోగ్యం ఎలావుందోనని ముందు ఆందోళనపడ్డాడు. ఉదయమే యాదగిరిని పంపించాడు కారణం తెలుసుకు రమ్మని. యాదగిరి తెచ్చిన వార్తవిని ఓ క్షణం నిశ్చేష్టుడై పోయాడు. ఆ తర్వాత రక్తం తుకతుకలాడిపోయింది.

ఉదయంనుంచి ఒకటే అశాంతిగా వుంది.

ఆ వార్త నలుగుర్లోపెట్టి నాలుగు దులిపేస్తేగాని అతని మనసు శాంతించదు. అతనిలోని ఉడుకు చల్లారదు.

"ఈ పాడువర్షం ఇవ్వాళే దాపరించాలా!" అని విసుక్కున్నాడు.




ఏ బాదరబందీలేని శేషాచలం ఎక్కువ కాలాన్ని భగవత్ చింతనలోనే గడుపుతాడు.

ఒకే కూతురు. పెళ్లయి బొంబాయిలో భర్తతో కాపురం చేస్తూ వుంది.

సుఖంగా రోజులు దొర్లించడానికి పిత్రార్జితంతోపాటు వయసులో సంపాదించింది బాగానేవుంది.

శేషాచలం నలభై య్యో ఏట భార్య ఇహలోకబంధాల నుంచి విముక్తి పొందింది. పారమార్థిక చింతనగల శేషాచలం మనసు భౌతిక సుఖాలనుంచి విముక్తి పొందింది. శేష జీవితాన్ని పరలోక చింతనలోనే గడపడానికి నిశ్చయించుకుని పది ఏళ్లుగా వంటరిజీవితాన్నే గడుపుతూ వచ్చాడు.

ఫలితంగా శేషాచలం ఇల్లు ఓ బుల్లి పుణ్యక్షేత్రంగా మారింది.

శేషాచలం రోజూ పురాణం చదివి వినిపిస్తూ తనతో పాటు మరికొందరికి పుణ్యం సంపాదించి పెడ్తున్నాడు. అప్పుడప్పుడు ఆనందనిలయంలోకూడా పురాణకాలక్షేపం చేస్తూ వుంటాడు.

ఆయన పురాణం వినడానికి వచ్చేవాళ్ళలో చాలామందికి అతనంటే గురుభావం ఏర్పడింది.

డబ్బంటే శేషాచలం గడ్డి తింటాడని కొందరు గిట్టని వాళ్లు అనడం కూడా కద్దు. అదినిజంకాదని నిరూపించడానికి అప్పుడప్పుడు దానధర్మాలు కూడాచేస్తూ వుంటాడు. కొన్ని కొన్ని సత్కార్యాలు కూడా జరిపించాడు.

పురాణపఠనానికి ముందు శేషాచలం శ్రోతలతో కొంత సేపు లోకాభిరామాయణం చర్చిస్తూ వుంటాడు.

శేషాచలానికి అవినీతి అంటే బొత్తిగా గిట్టదని అతని స్నేహితులకు తెలియని విషయం కాదు.

ఆ పురాణ కాలక్షేపానికి చేరిన ఆపదిమందినీ మిన హాయించిఅందర్ని గురించీ మాట్లాడుకుంటారు.

వర్షం పూర్తిగా తగ్గిపోయింది. పురాణకాలక్షేపానికి ఒక్కొక్కరే వస్తున్నారు. కరెంటు లేదు.

యాదగిరి 'పెట్రొమాక్స్‌లైటు వెలిగించి ముక్కాలిపీట మీద పెట్టాడు.

యాదగిరి తెచ్చిఇచ్చిన వక్క నోట్లో వేసుకుని పటుక్కున కొరికి ''అబ్బే కుళ్ళిపోయింది," అన్నాడు శేషాచలం.

యాదగిరికి అర్థంకాలేదు కుళ్ళిపోయింది ఏమిటో!

అక్కడ చేరిన నలుగురూ ముఖముఖాలు చూసుకున్నారు.

"బొత్తిగా కుళ్లిపోయింది."

"పుచ్చిపోయిందా?" అడిగాడు రామనాథం 'వక్క కుళ్లిపోవడం ఏమిటి?' అని అనలేక.

"లేదు. కుళ్ళిపోయింది." అన్నాడు శేషాచలం వక్క నములుతూ.

"వక్క కుళ్ళిపోవడం ఏమిటయ్యా?" అన్నాడు వెంకటేశం "నువ్వేం పండితుడివయ్యా పైగా పురాణం చదివి వినిపిస్తావూ?" అన్నట్టు వుంది అతని ధోరణి.

"వక్క గురించి కాదయ్యా నేను అనేది?"

"మరి ఏమిటండీకుళ్ళిపోయిందీ? ' రామనాథం అడిగాడు

మిగతావాళ్ళు శేషాచలం ముఖంలోకి కుతూహలంగా చూశారు.

''ఇందాక తిన్న అర్టిపండేనా? పూర్తిగా కుళ్ళిపోలేదు. ఇంకోరోజుంటే కుళ్ళిపోయేదే.'' అన్నాడు పని కుర్రవాడు యాదగిరి.

శేషాచలం యాదగిరి ముఖంలోకి జాలిగా చూశాడు.

''పిచ్చివాడా! పండుకాదురా నాయనా కుళ్ళిపోయింది!" అన్నాడు శేషాచలం.

"మరేంటండీ?" నలుగురూ ఒకేసారి అడిగారు.

"సంఘం! సంఘం! పూర్తిగా కుళ్ళిపోయింది. ధర్మక్షేత్రం అయిన మన భారతక్షేత్రం పూర్తిగా అధర్మక్షేత్రం అయిపోయింది."


యాదగిరికి ఏమీ అర్థంకాలేదు. తెల్ల ముఖం వేసి చూశాడు. యాదగిరికి పళ్లు కుళ్ళిపోతాయని తెలుసు. కాని సంఘం ఎలా కుళ్ళిపోతుందో తెలియదు.

"చిన్నగా అంటారేమిటి? అది ఏనాడో కుళ్ళిపోయింది!" అన్నాడు నర్సయ్య.

"మీకూ తెలిసిందా?" శేషాచలం నర్సయ్య ముఖంలోకి చూశాడు.

"ఏమిటి? కొత్త విషయం ఏదైనావుందా?" అన్నాడు నర్సయ్య.

"వీరభద్రయ్య ఎంతపనిచేశాడో తెలుసా ?"




"ఏంచేశాడు?" నలుగురూ ఒక్కసారే ప్రశ్నించారు.

"వారంరోజులుగా రావడంలేదే?" అన్నాడు సాలోచనగా నర్సయ్య.

"వీరభద్రయ్య..." ఓ క్షణం ఆగాడు శేషాచలం.

అందరూ ఊపిరి బిగబట్టి అతని ముఖంలోకి చూశారు.

"పెళ్ళిచేసుకున్నాడు." కంఠంలో ఏవగింపు వుంది.

"ఆఁ!"

"నిజంగా?"

"ఎప్పుడూ?"

"ఎంతపని చేశాడూ?" రామనాథం ముక్కుమీద వేలు వేసుకున్నాడు.

"వీరభద్రయ్య ఈ వయసులో ఇంతపని చేస్తాడనుకో లేదు సుమా!" అన్నాడు నర్సయ్య.

"ఇన్నిటికీ ఎప్పుడూ, ఎవర్నీ, ఎక్కడా?" రంగనాథం ప్రశ్నల వర్షం కురిపించాడు.

"ఆనందనిలయంలో పిల్లట. డబ్బు ఇచ్చికొనుక్కున్నాడట. పెళ్ళా పెటాకులా. డబ్బిచ్చి వెంటేసుకొని వచ్చి వుంటాడు." అన్నాడు శేషాచలం.

"ఆనందనిలయంలో పిల్లా? అక్కడంతా చెడిపోయిన వాళ్ళే వుంటారని విన్నాను!" నర్సయ్య అన్నాడు.

"అవునవును. అది ఎన్ని తిరుగుళ్ళు తిరిగి అక్కడ చేరిందో! ఆముదం తాగినట్టు ముఖం పెట్టాడు రంగనాథం.

"ఏ కులమో?" సాలోచనగా అన్నాడు రామనాథం.

"ఏంపాడో! పైగా ఆ పిల్లకు నిండా ఇరవై ఏళ్ళు కూడా లేవట" వాంతి చేసుకుంటున్నట్టు ముఖంపెట్టాడు శేషాచలం.

ఏనాడో పెళ్ళాం చచ్చిన వీరభద్రయ్య— అరవయ్యో పడిలోపడ్డ వీరభద్రయ్య—సాటి కులస్తుడైన వీరభద్రయ్య —ఇంత చండాలం పనిచేస్తాడా? కులం గోత్రం లేని పిల్లను— చెడిపోయిన ఆడదాన్ని— కొనుక్కొచ్చి ఇంట్లో పెట్టుకుంటాడా? తల్చుకున్నకొద్దీ శేషాచలానికి అరికాలు మంట నెత్తికి ఎక్కుతూవుంది.

"అసలా వీరభద్రయ్య బుద్ధికాస్త మెతకే అనుకుంటా?" రంగనాథం శేషాచలం కళ్ళలోకి చూశాడు.

"చాటు మాటుగా ఏదో తగలబడుతూనే వుండేవాడనుకో. ఆ ఏడుపేదో ఆ చాటుగానే ఏడిస్తే పోలా? మరీ ఇంత బరితెగించి, ఇంట్లోనే తెచ్చిపెట్టుకుంటాడా?" ముక్కుమీద వేలు వేసుకున్నాడు శేషాచలం.

"అది ఎంతకాలం కాపరం చేస్తుందిలే!" తనకు కావాల్సింది అదే అన్నట్టుంది రంగనాథం ధోరణి.

అంతవరకూ మౌనంగా కూర్చున్న చలపతి "అతని ఏడుపేదో అతను ఏడుస్తాడు. మనకెందుకుగాని పురాణం మొదలు పెట్టండి." అన్నాడు.

శేషాచలం చలపతికేసి అపరాధిని చూసినట్టు చూశాడు.

రంగనాథం, నర్సయ్యా చురచుర చూశారు.

"మా బాగా చెప్పావయ్యా! మనుషులు ఇంత చెడిపో తుంటే చూస్తూ ఊరుకుంటామా?" కోపంగా అన్నాడు రామనాథం.

"ఏంటయ్యా చెడిపోయేది? అమాటకొస్తే అందరిళ్ళల్లో ఏదో ఒక లొసుగు వుండనేవుంటుంది." అన్నాడు విసుగ్గా చలపతి.

అమాట ప్రతి ఒక్కళ్ళకూ తగిలినట్టే అనిపించింది. అందరూ బిగిసిపోయి కూర్చున్నారు.

శేషాచలం పురాణం ప్రారంభించాడు.

మాయాజూదంలో ధర్మరాజు అన్నిటితోపాటు పెళ్లాన్ని కూడా ఓడిపోయిన ఘట్టం చదివాడు.

## 4


వీరభద్రయ్య పురాణ కాలక్షేపానికి అంతగా రాకపోయినా శేషాచలం దగ్గరకు వస్తూనేవున్నాడు.

మొదటిరోజు శేషాచలం అసలు మాట్లాడనేలేదు. ఆ తర్వాతకూడా ముభావంగానే వుంటున్నాడు. అయినా వీరభద్రయ్య వస్తూనేవున్నాడు. తన కొత్త సంసారం గురించి కబుర్లు చెబుతూనే వున్నాడు.

వీరభద్రయ్య తనకు భార్యద్వారా లభిస్తున్న సుఖాన్ని గురించి లొట్టలు వేసుకుంటూ చెబుతూవుంటే శేషాచలానికి వళ్ళు మండిపోతూ వుంటుంది.

"నువ్వేన్నయినా చెప్పు! ఈ వయసులో పెళ్లేమిటి అనే అంటాను." అన్నాడు శేషాచలం ఒకరోజు

కుళ్లు! కడుపుమంట! తను సుఖపడిపోతున్నాడని బాధ. అతనికీ కావాలి సుఖం! అయితే ధైర్యంలేదు. పరువుప్రతిష్ఠల మీద అభిమానం ఎక్కువ. అందుకే తనను చూసి ఏడుస్తున్నాడు, అనుకున్నాడు వీరభద్రయ్య.




"మగవాడికి వయసేమిటి ? మా ఊళ్లో పద్దమ్మగారి వెంకయ్య అరవై ఏళ్ళు దాటాక రెండోపెళ్ళి చేసుకున్నాడు. అరవై ఏడో ఏట ఆయనకు వంశోద్ధారకుడు పుట్టాడు," అన్నాడు వీరభద్రయ్య.

శేషాచలం వీరభద్రయ్య ముఖంలోకి చూస్తూ వంకరగా నవ్వాడు.

"అంటే ఇప్పుడు నీకూ పుట్టాడంటావ్ వంశోద్ధారకుడు?"

"ఏం ఎందుకు పుట్టకూడదూ?"

వీరభద్రయ్యకు తరగని ఆస్తివుంది. కాంట్రాక్టులు చేసి బాగా సంపాదించాడు. సంతానం లేదు. ఐదేళ్ళనాడే భార్య మరణించింది. భార్య వుండగానే చాటుమాటు తిరుగుళ్ళు వుండేవి.

"నిజంగా ఆ పిల్లకు నేనంటే ఎంత ఇష్టమో చెప్పలేను. నిద్ర లేస్తూనే నా పాదాలకు నమస్కరిస్తుంది. పూజ చేసుకోకుండా అన్నం తినదు. ఎంత అణకువ? ఎంతవినయం? నా మొదటి భార్యకూడా నన్ను ఇంతగా అభిమానించిదను కోను.

"అంతా నాటకం అయివుండాలి. లేకపోతే..."

"కాదు. ఆ పిల్లను ఒక్కసారిచూస్తే నువ్వేఅంటావు..."

"మరి అంత మంచిపిల్లయితే ఈ నిలయానికి ఎందుకు చేరిందో?" వ్యంగ్యంగా అన్నాడు శేషాచలం.

వీరభద్రయ్య గతుక్కుమన్నాడు. ఒక్కక్షణం ఏం చెప్పాలో బోధపడలేదు.

శేషాచలం గర్వంగాచూశాడు వీరభద్రయ్య కళ్ళల్లోకి.

వీరభద్రయ్య సంబాళించుకున్నాడు. "ఆ నిలయంలో చేరేవాళ్ళంతా చెడిపోయినవాళ్ళు కాదు. అది అనాథాశ్రమం. అనసూయ తల్లి దండ్రులు లేనిపిల్ల. అందుకే వాళ్ళ మేన మామ పోషించే శక్తిలేక ఆశ్రమంలో చేర్పించాడు." కల్పించి చెప్పేశాడు వీరభద్రయ్య.

"నా దగ్గిర పొగిడితే పొగిడావ్. ఆ పిల్లగురించి మరెవరితో నాకు చెప్పినట్టు చెప్పకు. నవ్వుతారు" అన్నాడు శేషాచలం.

"ఏం? ఎందుకు నవ్వుతారు? అందరి మనసుల్లోవుండే కోరిక అదే. కాని ధైర్యం చెయ్యలేరు. ధైర్యంచేసిన నన్ను చూసి లోలోపల ఏడ్చుకుంటారు. పైకి నవ్వుతున్నట్టు నటిస్తారు." అన్నాడు వీరభద్రయ్య.

గతుక్కు మన్నాడు శేషాచలం.

మనసును తడిమి చూసుకున్నాడు.

అక్కడ ద్వేషం లేదు.

జుగుప్సగానీ అసహ్యం గానీ అంతకంటే లేవు.

వాటికి బదులుగా ఈర్ష్య తేలుపిల్లలా కొండిఎత్తి తిరుగుతూ వుంది.

ఆ తేలుపిల్ల పెద్దదవుతుంది. కొండినిండా విషం చేరుతుంది. దేన్నో కుట్టాలి— ఆ విషాన్ని వెలుపలకి పంపాలి, అంతవరకు శాంతి వుండదు.

ఉలిక్కి పడ్డాడు శేషాచలం.

ఛ! తనకు ఈర్ష్య ఏమిటి? అటువంటి పాపపు ఆలో చనలే తన మనసులోకి రావు.

వీరభద్రయ్య తను అనుభవిస్తున్న సౌఖ్యాలను గురించి చెబుతూనే వున్నాడు.

శేషాచలంలో ఏనాటి నుంచో నివురుగప్పి ఆరిపోవడానికి సిద్ధంగావున్న అగ్నికణాలను ఊదుతున్నాడు వీరభద్రయ్య.

వీరభద్రయ్య వెళ్ళిపోయాక కూడా అతను చెప్పిన విషయాల గురించి ఆలోచించకుండా వుండలేకపోతున్నాడు శేషాచలం.

అతని అంతరాంతరాల్లో ఏదో కదలరాని బలహీనత కదులుతూవుంది.

ఏవేవో పాపపు తలపులు వెన్నంటి తరుముతున్నాయి.

పురాణం చెప్పడంలో ఇంతకుముందు అనుభవించిన పరమానందం ఇప్పుడు లభించడం లేదు.

ఆ మధ్య వీరభద్రయ్య భార్యను గురించి ఎక్కువగా మాట్లాడటం లేదు.


శేషాచలానికి వినాలని అనిపించేది. అది గ్రహించిన వీరభద్రయ్య ఇంకా బెట్టుగా వుండేవాడు.

వీరభద్రయ్య ఉత్సాహంగా కన్పిస్తున్నాడు. ఒకనాడు తెల్లటి జుట్టుకు నల్లటి రంగు వేసుకొని వచ్చాడు.

"రంగుకూడా వేస్తున్నావే?" అడిగాడు శేషాచలం.

"అవును? అది ఒకటే పోరుపెట్టి వేసింది." ముసి ముసిగా నవ్వుకుంటూ చెప్పాడు వీరభద్రయ్య.

శేషాచలం అక్కసుగా చూశాడు.




"తనే తలంటిపోసి రంగు వేసింది."

"వస్తాను మామయ్యా!" అంటూ కాంత బయటికి వెళ్ళిపోతూవుంటే వీరభద్రయ్య కళ్ళప్పగించి చూశాడు.

''ఏమిటలా చూస్తున్నావ్? మన పక్కింటి సీతాపతి కూతురు!" విసురుగా అన్నాడు శేషాచలం.

''అహ! అది కాదు..."

''ఆ పిల్లే నాకు రెండుపూటలా ఇంత గంజి కాచి పోస్తుంది. ఇంతకు ముందు తల్లి చేసేది. ఆమె పాపం! మంచం ఎక్కింది. అప్పటి నుంచీ కాంతే రెండు పూటలా వంటచేసి పెట్టిపోతూ వుంది. ఆ పిల్ల దాదాపు మా ఇంట్లోనే పెరిగింది." ఏదో సంజాయిషీ ఇస్తున్నట్టు చెప్పాడు శేషాచలం.

"మా ఆవిడ కూడా ఈ వయసులోనే వుంటుంది. మహా అయితే ఒకటి రెండేళ్ళు పెద్దది కావచ్చు." తన ధోరణిలోనే అన్నాడు వీరభద్రయ్య.

శేషాచలం ఉలిక్కిపడ్డాడు.

"హరి! హరీ!" మనసులోనే చెంపలు వేసుకున్నాడు.

"నా మాటవినవయ్యా! ఎంతకాలం ఈ వంటరి బతుకు?"

"వీరభద్రయ్యా?"

"ఎందుకయ్యా అంత బెదిరిపోతావ్? నేనేం కాని మాట అన్నాను చెప్పు? ఇల్లాలులేని ఇల్లు వల్లకాడుతో సమానం ......"

"ఇప్పుడు నాకు పెళ్ళేమిటయ్యా?"

శేషాచలం కంఠంలో కరుదనం లేదు బోలుతనం వుంది.

అతని కళ్ళలోకి చూస్తూ వీరభద్రయ్య ముసిముసిగా నవ్వుకున్నాడు.

"మగవాడికి వయసేమిటి?" పైగా ఏ మాత్రం నువ్వు నాకంటే చిన్నవాడివే..."

"అవుననుకో!'' నీరుకారిపోయాడు శేషాచలం.

"ఎవరో ఏదో అనుకుంటారని నీ భయం. లోకులు కాకులు, మన సుఖం కంటే ఎక్కువా? అయినా ఇంకెంత కాలం బతుకుతాం? బతికినా ఎంతకాలం జీవితాల్ని అనుభవించగలం చెప్పు! ఉడిగి పోయినశక్తి మళ్ళీ ఎన్నితపస్సులు చేసినా తిరిగి వస్తుందా?"

శేషాచలం ఆలోచనలో పడ్డాడు.

వీరభద్రయ్య లేచి "వస్తా! అది నా కోసం ఎదురుచూస్తూ వుంటుంది," అంటూ వడివడిగా వెళ్ళిపోయాడు.

వెళ్తూ వెళ్తూ శేషాచలంలో అప్పటికే రగులుతున్న అగ్నిలోకి మరో కట్టె విసిరిపోయాడు.

## 5

కాంతకు పదిహేడువెళ్ళి పద్దెనిమిదో ఏడు వచ్చింది. పొడవుగా సన్నగా తెల్లగా వుండే కాంతలో ఏదో అద్భుతమైన ఆకర్షణ వుంది. పెద్ద పెద్ద కళ్ళు. కాని ఆ కళ్ళలో కలలు కన్పించవు. ఏదో మూగతనం, నిర్లిప్తతా కన్పిస్తాయి.

తల్లి కనకమ్మ రోగిష్టిది.

తండ్రి సీతాపతి కోమటి కొట్లో పద్దులు రాసి నాలుగు రాళ్ళు తెస్తాడు. దాంతో నలుగురు పిల్లలూ, రోగిష్టిభార్యా, తనూ బతకాలి.

కాంత పెద్దది. ఆ తర్వాత ఆడపిల్లే, మాలతికి పదిహేను సంవత్సరాలు. తర్వాతవాళ్ళిద్దరూ మగపిల్లలు. మగపిల్లలు చదువుకుంటున్నారు. ఆడపిల్లల చదువు మిడిల్ స్కూలుతోనే ఆగిపోయింది.

సంసారం గడవడమే అంతంతమాత్రం. అందుకే ఆడపిల్లల్ని చదువుమానిపించి ఇంట్లో కూర్చోపెట్టాడు సీతాపతి,

శేషాచలానికి సీతాపతి బంధువుకాదు. ఎంతో కాలంగా ఇరుగు పొరుగు ఇళ్ళల్లో వుంటున్నారు.


సీతాపతి భార్యా శేషాచలం భార్యా స్నేహంగా వుండేవారు. సీతాపతి భార్య శేషాచలం భార్యకు ఇంటిపనుల్లో చేదోడు వాదోడుగా వుండేది. శేషాచలం భార్య ఆమె కష్టం వుంచుకొనేదికాదు. తనకు తోచిన విధంగా సహాయపడుతూ వుండేది.

శేషాచలం భార్య చనిపోయాక, సీతాపతి భార్యే వెళ్ళి రెండు పూటలా వంట చేసిపెట్టి వచ్చేది.

సీతాపతి భార్య కనకమ్మ రోగంతో మంచం ఎక్కింది.

శేషాచలం భార్య కాంతను ఎంతో ప్రేమించేది. దాదాపు ఆమె బతికుండగా కాంత వాళ్ళింట్లోనే పెరిగిందని చెప్పాలి.

కాంత శేషాచలాన్ని 'మామయ్య' అని పిల్చేది. తల్లి మంచం ఎక్కినప్పటి నుంచి కాంత రోజూ శేషాచలానికి




వంటచేసిపెట్టి వస్తుంది. శేషాచలం ప్రతిఫలంగా పదీ, పరకా నెలచివర్లో సర్దుతూ వుంటాడు.

శేషాచలం ఇంట్లో వంటచేసి ఇంటికి తిరిగి వచ్చింది శాంత.

తల్లి పొయ్యిదగ్గర కూర్చుని ముక్కుతూ మూలుగుతూ వంట చేస్తూ వుంది.

"నువ్వెళ్ళి పడుకోమ్మా! నేను చేస్తాను." అంటూ తల్లి చేతిలో పని అందుకుంది శాంత.

తలెత్తి కూతురి ముఖంలోకి చూసింది. కళ్ళలో నీరు తిరిగింది. మౌనంగా లేచి వెళ్ళి మంచంమీద తల వాల్చి కళ్లు మూసుకుంది.

మూసిన కళ్ళలో కూతురి రూపం నిల్చింది.

కూతుర్ని చూస్తూంటే తల్లికిగుండెలు తరుక్కుపోతాయి. తన వివశతమీద కోపం వస్తుంది. భర్తమీద కోపంవస్తుంది చివరికి ఆ కోపం ఏపుగా పెరిగిన కూతురిమీదకే మళ్లుతుంది.

ఆలోచిస్తూ పడుకుంది.

దాని ఈడువాళ్లంతా కాలేజీల్లోచదువుతున్నారు. కొందరు పెళ్లిళ్ళు చేసుకొని హాయిగా కాపరాలు చేసుకుంటున్నారు.

దాడి రాత ఎలా ఉందో?

ఎంతకాలం ఎదిగిన ఆడపిల్లను ఇంట్లో పెట్టుకోవడం? రెండో దానికికూడా పెళ్ళీడు వచ్చింది. ఇద్దరూ ఇంట్లో తిరుగుతూ వుంటే తనకు శత్రువులు ఇంట్లో వున్నట్టు అనిపిస్తూవుంది.

శాంత వయసులో వుంది. పాలపొంగులాంటి యవ్వనం, పొంగటానికి సిద్ధంగా వుంది. పొంగడం దాని గుణం. పొంగి పొయ్యిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులది.

తనేం చెయ్యగలదూ?

ఇంటి మగవాడు నిమ్మకు నీరెత్తినట్టు ఏదీ పట్టించుకోడు.

పాపం! ఆయన మాత్రం ఏం చేస్తారు? ఆయనకు మాత్రం బాధలేదూ? ఆ తెచ్చే జీతంరాళ్ళు తిండికే చాలక పోయె! కట్నాలుయిచ్చి ఆడపిల్లలకేం పెళ్ళి చెయ్య గలరు?

ఒకపూట అల్లుడికి అనువుగా ముద్దపెట్టే పరిస్థితిలేని తను పిల్లకు ఎలా పెళ్లి చేస్తుంది?

తను బతికుండగానే ఒకయ్య చేతిలో పెట్టగలిగితే! రెండోదాని తరహా చూస్తూంటే తనకెందుకో భయంగా వుంటుంది

ఎప్పుడూ ఏవేవో పాత పత్రికలు ముందేసుకుని కూర్చుంటుంచి. ఇంటి పరిస్థితులే పట్టవ్. కష్టం సుఖం బొత్తిగా తెలియదు.

శాంత గుణమే వేరు.

మితభాషి. పనిమంతురాలు. కష్టం సుఖం అర్థంచేసుకోగలదు.

కాని ఆఈడు పిల్లల్లో వుండాల్సిన ఉత్సాహం దాని ముఖంలో కన్పించదేం? కళ్లల్లో మెరుపూ కన్పించదు.

ఎప్పుడూ పరధ్యాన్నంగా వుంటుంది.

దిగుతేమో? పెళ్లికాలేదని దిగులేమో?

తల్లి గుండెలో ఏదో లోతుగా కలుక్కుమంది.

ఎంత దిక్కుమాలిన బతుకు? ఈడు వచ్చిన పిల్లకు పెళ్లి చెయ్యకపోగా, పోరుగింట్లో చాకిరి చెయ్యమని పంపిస్తూ వుంది.

శాంత తల్లి ప్రతినిముషం క్రృంగిపోతూ వుంది మానసికంగా శారీరకంగా కూడ.

కాని శాంత తండ్రికి ఆ ధ్యాసే వుండదు,

కోమటి కొట్లో పద్దుల పుస్తకాలకేఅతని జీవితంఅమ్ముడుపోయింది.

అతని ఆలోచనలన్నీ ఆ అంకెలచుట్టూనే వుంటాయ్.

ఉదయం ఎనిమిది గంటలకు వెళ్లిన మనిషి మళ్ళీ రాత్రి ఎనిమిందింటికే రావడం.

అహర్నిశలు ఓ పావలా డబ్బులు ఎక్కువ సంపాదించాలనే ఆలోచన తప్ప మరో ఆలోచనేరాదు అతనికి

## 6

ఆ రాత్రి మిసెస్ వైకుంఠం సంయుక్తను తన గదిలోకి పిలిచింది.

సంయుక్త మిసెస్ వైకుంఠం ఎదురుగా తలవంచుకొని నిలబడింది.

"ఏమాలోచించావ్?" కంఠం కటువుగా వుంది.

సంయుక్త వాచి బరువుగా వున్న కనురెప్పల్ని ఎత్తి మిసెస్ వైకుంఠం ముఖంలోకి చూసింది,

"మాట్లాడవేం?"

"నేను పెళ్ళిచేసుకోను. నాకు ఒక పెళ్ళి అయింది." అన్నది సంయుక్త ఏడుపు గొంతుతో.

"జరిగింది మర్చిపో! ఇక్కడ ఒకసారి అడుగుపెడితే పునర్జన్మ ఎత్తినట్టే ఇక్కడ వుండే వాళ్ళకు గతంలేదు. వర్తమానం మాత్రమే!''

సంయుక్త తలవంచుకుంది.

"మాట్లాడవేం?"

"నేను పెళ్లి చేసుకోను. నాకు పెళ్లి చేసుకోవాలని లేదు."

"మరి ఏం చేస్తావ్?"

"చదువు కుంటాను."

''ఇళ్లూ వాకిళ్లూ వదిలి తిరిగి తిరిగి ఇక్కడ చేరే మీ అందరికీ చదువులు కూడా చెప్పించాలా? ఈ వయసులో ఏం చదువుతావ్? కాలేజీలో చేర్తావా?'' వ్యంగ్యంగా అన్నది మిసెస్ వైకుంఠం.

"నాకు అలాగే చెప్పావ్! నాకు మాయమాటలు చెప్పి ఇక్కడకు తీసుకువచ్చావ్."

"ఓహో! అంతవరకూ వచ్చిందా? మొగుడు వెళ్ళగొడ్తే స్టేషన్‌లో ఏడుస్తూ వుంటే జాలి తల్చి తీసుకొచ్చాను. దిక్కులేని......"

"నాకు దిక్కులేకపోలేదు. మా అమ్మా నాన్నా వున్నారు. అక్కడికే వెళ్లిపోతాను." మొండిగా అన్నది సంయుక్త.

మిసెస్ వైకుంఠం రెచ్చిపోయింది.

"నీ ఇష్టమే ననుకున్నావా?"

"నాకు ఇక్కడ వుండటం ఇష్టంలేదు. వెళ్ళిపోతాను."

పకపక నవ్వు వినిపించి చివ్వున తలెత్తి చూసింది సంయుక్త.

ఎదురుగా ఆనందబాబా నిల్చుని వున్నాడు.

అతని రూపం కొత్తగా కన్పించింది. కళ్ళు ఎర్రగా వున్నాయి. వికటంగా నవ్వుతున్నాడు. క్రూరంగా చూస్తు న్నాడు.

"వెళ్తావా? ఎక్కడికి? ఇక్కడికి ఒకసారి వచ్చినవాళ్లు మళ్ళీ వెళ్ళడం అంటూ వుండదు." అన్నాడు.

సంయుక్త నిలువెల్లా వణికిపోయింది.

"చూస్తావేం? ఆ గదిలోపెట్టి తాళం వెయ్యి. ఎల్లుండి వాళ్ళు వస్తున్నారు. అంతవరకూ దీని బాధ్యత నాగేంద్రానికి అప్పగించు,'' అని మిసెస్ వైకుంఠంతో చెప్పి బయటికి వెళ్ళిపోయాడు ఆనందబాబా.

మిసెస్ వైకుంఠం సంయుక్తను లాక్కెళ్ళి గదిలో బంధించి తాళం వేసింది.

అహల్యనూ, గాయిత్రినీ పిల్చింది.

"దానికి ఏదైనా అవసరం అయితే తలుపుతీసి మళ్ళీ జాగ్రత్తగా గదిలోపెట్టి తాళంవెయ్యండి. అల్లరిచేస్తే వాచ్‌మేన్‌ను పిలవండి. ఇదుగో తాళంచెవి." అని చెప్పి మిసెస్ వైకుంఠం తన గదిలోకి వెళ్ళిపోయింది.

సంయుక్త మూసిన తలుపులకు చేరబడి భోరున ఏడవ సాగింది.

సంయుక్త హైదరాబాదు జిల్లాలోని ఒక గ్రామంలో రాజపుట్ కుటుంబంలో జన్మించింది. చాలా బీదకుటుంబం. తండ్రి స్కూలు టీచరుగా పనిచేస్తుండేవాడు. పెద్ద కుటుంబం. ఐదుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు. సంయుక్త పెద్దది. చామనఛాయలో ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది.

కర్నూలు సంబంధం చేశారు. పెళ్ళికొడుకుకు ముప్పై ఏళ్ళు. ఆ కుటుంబం కొంత కలిగిన కుటుంబమే. పైగా సమిష్టి కుటుంబం. పదిమందిదాకా వుండేవారు. ఇంటెడు చాకిరీ సంయుక్తమీదే పడింది. బీదకుటుంబంలో నుంచి వచ్చిన పిల్లకావడంవల్ల ఆమెకు ఆ ఇంట్లో దాసీదానికివుండే స్థానం ఇవ్వడం జరిగింది. ప్రతిదానికీ అత్తా, ఆడబిడ్డలూ, తోడికోడళ్ళూ ఆరడిపెట్టేవారు. భర్త పట్టించుకొనేవాడు కాదు. పైగా అతనికి లేని చెడుఅలవాటు లేదు.

ఒకరోజు తల్లి మాటలు విని సంయుక్తను భర్త చచ్చేలా కొట్టాడు.

సంయుక్త అత్తగారింట్లో చెప్పకుండా పుట్టింటికి పారిపోయి వచ్చింది. విషయం తెలుసుకొని తల్లీతండ్రీతిట్టారు. వెంటనే వెళ్ళిపొమ్మన్నారు. సంయుక్త ససేమిరా వెళ్ళ నన్నది. భర్తనువదిలేసిన ఆడపిల్లకు, అందులోనూ సాంప్రదాయాలకు ప్రాముఖ్యత వున్న పుట్టింట్లో స్థానం వుండదు. పైగా బీదకుటుంబం. సంయుక్తను పుట్టింట్లో అందరూ అపరాధిని చూసినట్టు చూడసాగారు. ఒకరోజు తల్లి మరీ అవమానం చేసింది.

ఆరోజు సంయుక్తకు తెలిసివచ్చింది పెళ్ళయిన పిల్లకు భర్తతోనే జీవితం గడపాలని. ఆ జీవితం నరక ప్రాయమైనా భరించాలని.

అంతే! భర్త దగ్గరకే వెళ్ళడానికి నిర్ణయించుకుంది.

కోపంలో ఎవరికీచెప్పకుండా హైదరాబాద్ బస్ఎక్కింది. కాచిగూడ స్టేషన్‌కు వచ్చేసరికి కర్నూలు వెళ్ళే బండి వెళ్లి

పోయింది. దిక్కు మొహంతో స్టేషన్‌లో ఏమీ పాలుపోక నిలబడిపోయింది.

అలా నిల్చున్న ఆమె దగ్గరకు ఓ అరవయ్యేళ్ళ వృద్ధుడు వచ్చి పలకరించాడు. ఆమె పరిస్థితి తెలుసుకున్నాడు. సానుభూతి చూపించాడు. వయసులోవున్న పిల్ల రాత్రంతా స్టేషన్‌లో వుండడం మంచిదికాదనీ, ఆ రాత్రికి తన ఇంటికి రమ్మని తీసుకువెళ్ళాడు.

అలా తీసుకొచ్చి అతను ఒక ఇంట్లో ఆ అమ్మాయిని వుంచాడు. ఆ ఇంట్లోవున్న నడివయసు స్త్రీ ఆ అమ్మాయిని ఎంతో ఆప్యాయంగా పలకరించి భోజనం పెట్టింది.

తెల్లవారి ఆమె సంయుక్తకు టిఫెన్‌పెట్టి అన్ని సంగతులూ అడిగి తెలుసుకుంది.

“ఆడదాని బతుకింతేనమ్మా! నీకు నాలుగు డబ్బులు సంపాదించుకొనేశక్తివుంటే ఇంతహీనంగా బ్రతకనక్కర్లేదు అందుకే నేను చెప్పినట్టు చేయ్. ఒక ఆశ్రమం వుంది. అందులో నీలాంటి అమ్మాయిలు చాలామంది వుంటారు. అక్కడ చదువుకోవచ్చు. ఆ తర్వాత ఉద్యోగం కూడా ఇప్పిస్తారు. ఇష్టపడితే మళ్ళీ పెళ్ళికూడా చేస్తారు.” అని చెప్పింది.

సంయుక్తకు ఆమె మాటల్లో నమ్మకం కలిగింది. భవిష్యత్తుమీద ఆశ కలిగింది. వెంటనే ఆశ్రమంలో చేరడానికి అంగీకరించింది.

వెంటనే ఆమె సంయుక్తను ఆనందనిలయానికి తీసుకొని వచ్చింది. ఆమె మిసెన్ వైకుంఠం.

సంయుక్త గతాన్ని తల్చుకుని ఏడ్చింది. భవిష్యత్తును తల్చుకుని నిలువెల్లా వణికిపోయింది.

## 7

నెల చివర. సీతాపతి ఇంట్లో బియ్యపు గింజలు కూడా లేవు.

సీతాపతి పొద్దున్నే కాఫీ నీళ్ళయినా లేకుండా దుకాణానికి వెళ్ళిపోయాడు.

శాంత శేషాచలం ఇంటికి వంట చెయ్యడానికి వెళ్ళింది.

కనకమ్మకు నీరసం ఎక్కువైంది. కళ్ళుమూసుకుని నులకమంచంలో పడుకుంది.

శాంత చెల్లెలు పక్కింటి అమ్మాయిదగ్గర తెచ్చుకున్న పాతపత్రికలు ముందేసుకుని కూర్చుంది.

మగపిల్లలిద్దరూ స్కూలుకు వెళ్ళారు. ఈ మధ్య వాళ్ళు నాగాపెట్టకుండా స్కూలుకు వెళ్తున్నారు. ఆ స్కూల్లో మిడ్‌డే మీల్ పెడ్తారు.

*With Best Compliments From*

**Mohan BROTHER**

WINE MERCHANTS

**TILAK ROAD, HYDERABAD-500 001.**

Grams: LARSEN

Phones: 42548
53025

*Branches at*

Opp. Public Garden
**Hyderabad**
Phone : 32063

Jawaharlal Nehru Road
**Hyderabad**
Phone : 42596

*Distributors For*

KING FISHER LAGER, FLYING HORSE PREMIUM LAGER

కాంత వంట పూర్తిచేసి ఇంటికి వచ్చింది. మనసులో ఏదో దిగులు. గుండెల్లో గుబులు.

తల్లిని ఓ క్షణం చూసి వంటింట్లోకి వెళ్లింది. బియ్యపు డబ్బా వంచి చూసింది. చారెడు బియ్యం కూడా లేవు.

రాత్రివండిన అన్నపు తపేలామీద మూతతీసింది. రాత్రి అన్నం కొద్దిగా వుంది.

"మాలతీ! మాలతీ!"

"ఏమిటక్కా!" విసుగ్గా వచ్చింది మాలతి.

"రాత్రి అన్నం కొంచెం వుంది. గోంగూర పచ్చడివుంది అన్నం తిను," అన్నది.

"మరి నీకో!"

"నాకు ఆకలిగా లేదుదులే..." అంటూ తల్లి దగ్గిరకు వెళ్లింది కాంత.

మాలతి అన్నం పెట్టుకొని తిని మళ్ళీ వచ్చి పత్రికల్లో తలదూర్చింది.

కాంత తల్లికేసి దిగాలుగా చూసింది.

కనకమ్మ కళ్ళు తెరిచింది. కూతుర్ని చూసింది. కూతురి ముఖంలో దిగులును చూసింది. కళ్ళల్లో చీకటినీ చూసింది.

"అన్నం తిన్నావా తల్లీ!"

"తిన్నాను." అన్నట్టు కాంత తల ఊపింది.

కనకమ్మ పేలవంగా నవ్వింది. ఆమె ప్రశ్నకు ఆమెకే నవ్వొచ్చింది.

తనేం ప్రశ్నించింది? అన్నం తిన్నావా అనిప్రశ్నించింది. ఇంట్లో బియ్యం లేవని తనకు తెలియదూ? ఇంట్లో వంట చెయ్యలేదని తెలియదూ? తెలిసీ ఆ ప్రశ్నే అడిగింది. కాంత తిన్నానని సమాధానం చెప్పింది. మరి తన తెలివి తక్కువ ప్రశ్నకు అంతకంటే ఏం చెబుతుంది సమాధానం.

"కాంతా! ఇంట్లో బియ్యం లేవుగదూ?"

కాంతకు దుఃఖం పెల్లుబికింది.

"లేవు," అనలేదు. తల ఊపింది.

"కాంతమ్మ పిన్నిని అడిగి ఓ శేరు బియ్యం వుంటే తీసుకురా తల్లీ. రేపే ఫస్టు తారీఖుగా ఎల్లుండి ఇచ్చేస్తాం అని చెప్పు!"

కాంత చేటతీసుకొని కాంతమ్మ ఇంటికి వెళ్లింది. ఐదు నిముషాల్లో వట్టి చేతులతో తిరిగి వచ్చింది.

"ఏమ్మా! ఏమన్నది కాంతమ్మ పిన్ని?"

కాంత పలకలేదు.

కనకమ్మకు మళ్లీ అడిగే ధైర్యం లేదు.

ఆ! ఏమంటుంది? ఇప్పటికే చాలా బాకీవున్నారని వుంటుంది. మా ఇంట్లోనూ బియ్యం నిండుకొన్నాయమ్మా అని వుంటుంది.

ఎవరైతే మాత్రం ఎంతకని అప్పులు ఇస్తారు? తమది ఒక నాటితో తీరే దరిద్రమా?

మధ్యాహ్నం అయేసరికి కాంతకు కడుపులో ఏదో కిర కిర చుట్టుకుంటున్నట్టు అనిపించింది. ఏదోమంట కడుపులో ప్రారంభం అయి గుండెల దాకా ఎగబాకుతూ వుంది.

కాంత భరించలేకపోయింది. వంటింట్లోకి వెళ్లి రెండు గ్లాసుల నీళ్లు గటగటాతాగింది. కడుపులో కొంతచల్లబడింది.

కాంతకు తండ్రి గుర్తొచ్చాడు.

నాన్న ఉదయం ఏమీ తినకుండానే వెళ్లిపోయాడు. పచ్చి గంగముట్టలేదు. ఎలా పనిచేస్తున్నాడో ఏమో? పగ లంతాకష్టపడి రాత్రికి నకనకలాడిపోతూ ఇంటికి వస్తాడు. రాత్రికూడా ఏమీ తినకుండా తెల్లవారి పనిలోకి ఎలా వెళ్తాడు, పద్దులు ఎలా రాస్తాడు.

పగలంతా కష్టపడి కాలే కడుపుతో రెండుమైళ్ళు నడిచి ఇంటికి వస్తాడు.

తండ్రి బక్క చిక్కిన రూపం కాంత కళ్ళ ముందు నిల్చింది.

కాంత కళ్ళనిండా నీరు తిరిగింది.

హాయిగా చద్దన్నం తిని వారపత్రికలు చదువుతూ కూర్చున్న చెల్లెలి మీద చిరాకువేసింది.

పాపం! అది మాత్రం ఏం చేస్తుంది. వయసుకుతగ్గ కోరికలు వున్నాయి. అవి తీరేమార్గంలేదు. ఆ కథల్లోని పాత్రలతో తాదాత్మ్యం చెందుతూ సంతృప్తి పొందుతున్నది.

సాయంత్రం తమ్ముళ్ళు స్కూలునుంచి వస్తూనే 'ఆకలి' అంటారు. అన్నం పెట్టకపోతే నిద్రపోరు. చిన్నవాడు రాత్రంతా ఏడుస్తాడు.

అమ్మ అసలే నీరసంగావుంది. జావకూడా తాగలేదు.

దిగ్గునలేచి తల్లి మంచం దగ్గిరకు వచ్చింది కాంత.

"అమ్మా!" కంఠంలో జీర పలికింది.

ఓపిక లేనట్టు బలవంతంగా కళ్లు తెరిచింది కనకమ్మ.

"జావకాచి ఇవ్వమంటావా అమ్మా?"

"ఈ పూటకు ఏమీవద్దులే. ఆకలిగాలేదు. రాత్రికి కాచి ఇద్దువుగాని." అని కళ్ళు మూసుకొని పక్కకు ఒత్తిగిలి పడుకుంది కనకమ్మ.

కాంతకు తన ప్రశ్నా, తల్లి సమాధానం రెండు అర్థహీనంగా అనిపించాయి.

ఏదో తను అడిగింది. దానికి అమ్మ సమాధానం చెప్పింది. అమ్మకు ఆకలిలేదా? ఆకలిగావుంది అంటే మాత్రం తనేం చెయ్యగలదు? అందుకే అమ్మ ఆకలిగాలేదు అంది.

రాత్రికి అమ్మకు ఎలాగయినా జావ కాచి ఇవ్వాలి తమ్ముళ్ళకూ, నాన్నకూ అన్నం పెట్టాలి.

కాని ఎలా? ఎలా?

ఇంట్లో వాళ్ళందరి ఆకలిగురించి ఆలోచిస్తున్నా శాంతకు కడుపులో ఏదో జంతువు కదిలినట్లు అనిపించింది. ఆ జంతువు నిద్ర లేస్తున్నది. ఆది నిద్రలేస్తే దానిపళ్ళు ఎంత పదునుగా వుంటాయో శాంతకు తెలుసు

ఎలాగయినా రాత్రికి ఓ శేరు - కనీసం అర్థశేరయినా బియ్యం కావాలి.

ఎలాగైనా సంపాదించాలి. ఎలా? ఎలా?

శాంత కళ్ళముందు శేషాచలం స్టోర్ రూంలోవున్న నిలువెత్తు బియ్యపు డబ్బా. ఆ డబ్బాలో సగానికి పైగా వున్న సన్న బియ్యమూ... కన్పించాయి.

శేషాచలాన్ని ఏ ముఖం పెట్టుకొని అడుగుతుంది? అప్పటికే ఈ నెల్లో మూడుసార్లు తెచ్చింది. మూడోసారి విసుక్కున్నాడు. ఈ నెలకు మళ్లీ అడగొద్దన్నాడు.

ఈరోజుకు... ఈ ఒక్క రోజుకు... ఎలాగైనా అడగాలి... కాని ఇవ్వకపోతే?

పొద్దు వాటాలింది.

శాంత ఆలోచనల నుంచి బయటపడింది.

శేషాచలం ఇంటికి బయలు దేరింది

శేషాచలం ఇంట్లోలేడు. కాలవగట్టుకు వీరభద్రయ్యతో షికారు వెళ్ళాడు.

శేషాచలానికి ఈమధ్య వీరభద్రయ్య మాటలంటే ఎక్కడలేని కుతూహలం పుట్టుకొస్తున్నది. గుచ్చి గుచ్చి అడిగి మరీ తెలుసుకుంటున్నాడు

గడపలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న యాదగిరి "ఇయ్యాల ఆలశం అయిందేం బుల్లెమ్మగారూ?" అన్నాడు శాంతతో.

"అవును. యాదగిరీ! ఆలస్యం అయింది." అంటూ శాంత లోపలికు వెళ్ళింది

శాంత వంటింట్లోకివెళ్ళింది.

పనిమనిషి నున్నగా తోమి పెట్టిన పాత్రలు మెరుస్తున్నాయి

అన్నం తుకతుక ఉడుకుతూవుంది

శాంత మెదడుకూడా ఉడుకుతూవుంది.

అన్నం కూరా వండి పెట్టింది.

బయటికి వచ్చేస్తూ ఓ క్షణం ఆగి ఆలోచించింది.

ఇంకా శేషాచలం రాలేదు.

వంటింటి తలుపులువేసి స్టోర్ రూంలోకి వెళ్ళింది లైటు వేసింది.

*With best Compliments from*

# MEENA BAZAR

**(SAREES SPECIALIST)**

**TILAK ROAD (ABIDS), HYDERABAD-500 001**

Phone : 46966

*NOW OFFERS YOU LATEST SAREES*

**IN**

Banarasi, Kanchipuram, Dharmavaram, Bangalore, Venkatagiri, Chanderi, Kota, Tar-kam, Batik Printed Sarees, Cotton Sarees, Blouse Pieces to match every saree, Borders & Dress Materials, Zari Embroidary on Nylon's & Shiffons.

SPECIALISTS IN BANARAS & EMBROIDARY

ఓ క్షణం మళ్ళీ ఆలోచనలో పడింది.

ఆకలితో తిరిగివచ్చే నాన్నా, ఓపికలేక నిస్త్రాణపడి, మంచానికి అతుక్కుపోయిన తల్లీ, అన్నంకోసం ఏడుస్తున్న తమ్ముళ్ళూ, ఆకలి అవుతున్నా చెప్పకుండా ముణగ తీసుకొని మూడంకెలేసి పడుకొనే చెల్లెలూ - అన్నింటికీమించి - తన కడుపులో క్రూరంగా తన పేగుల్ని కొరుకుతున్న ఆ జంతువూ...

శాంతకు వంట్లో నీరసంగావుంది. కళ్ళు తిరుగుతున్నట్టు అనిపించింది. కాళ్లు తేలిపోతున్నాయి.

బియ్యపు డబ్బా మూత తీస్తుంటే చేతులు వణికాయి. గుండెలు దడదడ లాడాయి.

త్వరత్వరగా ఓ శేరు బియ్యం పైట చెంగులో పోసుకుంది.

బియ్యపు డబ్బా మూత వేస్తుండగానే వెనక ఏదో చప్పుడు అయింది. డబ్బా మూత వదిలేసి వెనక్కు తిరిగింది.

శాంత నిలువెల్లా కంపించిపోయింది.

మరు క్షణం స్థాణువులా బిగుసుకుపోయి నిల్చుంది.

శేషాచలం ఎదురుగా వాకిలికి అడ్డంగా నిల్చుని వున్నాడు.

మనిషి కోపంతో బుసలు కొడ్తున్నాడు.

కళ్లు చింత నిప్పుల్లా కణకణ లాడుతున్నాయి.

ముఖం జేవురించింది.

ముక్కు పుటాలు అదురు తున్నాయి.

అప్పుడే ఇంటికి తిరిగివచ్చిన శేషాచలం, సామానుల గదిలో అలికిడి వినిపించి వచ్చాడు.

శాంత చేస్తున్న పనిచూసి ముందు విస్మయం చెందాడు.

మరుక్షణంలో కోపంతో వళ్ళు తెలియలేదు.

ఆయనకు దొంగతనం అంటే గిట్టదు.

"ఎన్నాళ్ళనుంచి ఈపని చేస్తున్నావ్?" చెడిపోయిన ఫాన్ ఆన్‌చేసినట్టు వచ్చింది శబ్దం.

శాంత నిలువు గుడ్లేసి చూస్తూ నిల్చుంది.

"ఇంకా ఏమేమి ఎత్తుకెళ్ళావ్?"

శాంత ఉలకలేదు పలకలేదు.

"ఛీ దొంగముండా! మాట్లాడవేం?" శేషాచలం పిచ్చి కోపంతో అరిచాడు.

స్థూలకాయుడు. దానికి తోడు చిరుబొజ్జ. నల్లటి శరీరం. వళ్ళు తెలియని కోపంతో బుసలు కొడ్తున్నాడు.

శాంత కళ్ళకు సినిమాలలో డబ్బుతీసుకొని హీరోను చంపడానికి వెళ్ళే రౌడీలా కన్పించాడు శేషాచలం.

శేషాచలం కదిలాడు. ముందుకు వస్తున్నాడు.

అలా వస్తూన్న శేషాచలం, ముందు కాళ్ళు పైకెత్తి, వెనక కాళ్ళమీద నడిచి వస్తున్న ఎలుగుగొడ్డులా కన్పించాడు శాంతకు.

శాంత ప్రాణాలు బిగబట్టి నిల్చుంది.

పాలరాతి విగ్రహంలా చలనరహితంగా నిల్చుంది.

శేషాచలం ముందుకు వచ్చాడు. రెండు చేతులతో శాంత రెండు జబ్బలూ గట్టిగా పట్టుకున్నాడు.

పులి పంజాలో చిక్కిన లేడిలా దీనంగా, అమాయకంగా, భయంగా చూసింది.

తోడేలు కోరలకు చిక్కిన మేకపిల్లలా గజగజలాడిపోయింది.

పళ్ళచక్రంకింద చెరుకుగడలా జవజవలాడిపోయింది.

శాంత నున్నటి, వెచ్చటి, మెత్తని స్పర్శ, మోడువారిన శేషాచలం హృదయానికి కరెంటుషాక్‌లా తగిలింది.

ఏనాటినుంచో నివురు గప్పిన వాంఛలూ, కోరికలూ, అతని గుండెల్లో గుబగుబలాడినై.

అంత కోపమూ నీరుకారిపోయింది.

అతనిలోని కాఠిన్యం మంచులా కరిగిపోయింది.

ఆమె స్పర్శసౌఖ్యాన్ని అనుభవిస్తూ కొద్ది క్షణాలు తన్మయత్వంలో అలాగే వుండిపోయాడు.

అతని చేతులు, కాలనాగుల్లా, ఆమె భుజాలపైనా, మెడమీదా, చెంపలపైనా పాకుతూవుంటే, శాంత, మూగ పశువులా చూస్తూ వుండిపోయింది.

శేషాచలం శరీరంలో దెయ్యపు శక్తులు విజృంభించాయ్.

అతని కళ్ళకు పొరలు కమ్మాయ్.

శేషాచలం కాలనాగై శాంతను కాటువేశాడు.

అతనిలోని పశువాంఛకు ఆమె బలిఅయింది.

ఆమె ఒడినుంచి బియ్యపు గింజలు కారి గదంతా ఆక్రమించాయ్. అతను చేసిన పాపానికి అవి ప్రత్యక్ష సాక్షులు. అయినా అవి సాక్ష్యం చెప్పలేవు.

శాంత లేచింది. పెదపులి పంజాలోనుంచి బయటపడ్డ దానిలా బయటికి పారిపోయింది.

వెళ్తున్న శాంతను చూసి "శాంతా! బియ్యం తీసుకెళ్ళు. ఎవరికీ చెప్పబాక!" బొంగురుపోయిన కంఠంతో అన్నాడు శేషాచలం

శాంతకు ఆ మాటలు వినిపించలేదు.

పీడకలలో నడుస్తున్నదానిలా వెళ్ళిపోయింది.

శాంత వెళ్ళాక శేషాచలం రెండు చేతులతో తల పట్టుకొని కూర్చున్నాడు.

ఈ సంగతి శాంత ఇంట్లో చెబితే?

పాపభీతి కంటే లోకభీతి ఎక్కువైంది శేషాచలానికి.

గోడకు తగిలించి వున్న వెంకటేశ్వరస్వామి ఫొటోలోకి చూశాడు.

ఆ స్వామి కళ్ళకు పట్టీలు (నామాలు) వేసివున్నాయి.

"స్వామీ! ఈ పాపిని క్షమించు. అల్లరిపాలు కాకుండా కాపాడు. త్వరలోనే నీ కొండకు వచ్చి వెయ్యి రూపాయలు ముడుపు చెల్లిస్తాను."

రెండు చేతులూ ఎత్తి మొక్కుకున్నాడు.

శేషాచలానికి మనసు మనసులో లేదు.

శాంత చెబుతుందా?

ఏమని చెబుతుంది? ఎవరికి చెబుతుంది?

ఏ ఆడపిల్లా ఇటువంటి విషయాలు తల్లిదండ్రులకు చెప్పదు

వీరభద్రయ్య లోపలకు వచ్చాడు.

"ఏమి టలా కూర్చున్నావ్? పద! పద! అందరూ వచ్చారు. పురాణం ప్రారంభించు" అన్నాడు.

"ఇవ్వాళ నాకు వంట్లో బాగాలేదు. నేను పురాణం చెప్పలేను"

"మరి అందరూ వచ్చి కూర్చున్నారే!"

"ఇవ్వాళ నావల్ల కాదు."

"పోనియ్ నేను చెప్పనా? నీ అంత బాగా చెప్పలేకపోయినా, నేనూ చెప్పగలనుగా? రా! వచ్చి కూర్చో."

శేషాచలానికి వెళ్ళాలని లేదు.

మౌనంగా లేచి బయటికివచ్చి కూర్చున్నాడు.

పురాణం ప్రారంభం అయింది.

ఆనాడు "కౌరవ సభలో ద్రౌపదీ వస్త్రాపహరణం" ఘట్టం చెబుతూ వుంటే శేషాచలం గోడకు చేరబడి కూర్చున్నాడు.

దుశ్శాసనుడు ద్రౌపదిని సభా మధ్యానికి ఈడ్చుకు వచ్చాడు.

నిండు సభలో చీరలాగుతూ వుంటే, 'హే కృష్ణా! హే కృష్ణా! అంటూ ద్రౌపది విలపిస్తూవుంది.

ఈ ఘట్టం ఎన్నోసార్లు శేషాచలం వినేవారి మనసులు కరిగేలా వర్ణించిచెప్పాడు.

శ్రీకృష్ణుడు ఎలా ఆమె శీలాన్ని కాపాడాడో తన్మయత్వంతో చెప్పేవాడు.

కాని ఆ రోజు శేషాచలానికి ఓ చిన్న సందేహం వచ్చింది!

ద్రౌపదిని ధర్మరాజు జూదంలో ఓడిపోయాడు. నిజమే! దుశ్శాసనుడు ఆమెను నిండు సభలో అవమానించాడు. చీర లాగాడు. అదికూడా నిజమే!

**GRAND PRINTERS**

**H. No. 27-6-12, Prakasam Road**

**Governerpet, Vijayawada-2**

కాని శ్రీకృష్ణుడు నిజంగా ఆమెకు అనంతమైన వలువల్ని ప్రసాదించి ఆమె మానాన్ని సంరక్షించాడా? లేదు. అది మాత్రం అబద్ధం. భారతం రాసింది మగవాడేగదా! అందుకే ...అది నిజమే అయితే మరి శాంత శీలం...వెంకటేశ్వర స్వామి కాపాడలేదేం?

ఆ పైకి ఆలోచించలేకపోయాడు. గుండెలు కదబడ్డాయి కళ్ళు చెమ్మగిల్లాయి.

పురాణం సమాప్తం అయింది

అందరూ వెళ్ళిపోయారు.

వీధివాకిలి గొళ్ళెంపెట్టి వచ్చి పడుకున్నాడు శేషాచలం.

నిద్ర రావడం లేదు. మంచంమీద దొర్లుతున్నాడు.

సాయంకాలం జరిగిన సంఘటనను మర్చిపోలేకుండా వున్నాడు.

ఒక క్షణం ఆ అనుభూతిని నెమరువేసుకుంటూ తన్మయత్వాన్ని పొందుతున్నాడు.

మరుక్షణం పాపభీతితో వణికిపోతున్నాడు

## 8

హరికి ఆకలిగా వుంది. జేబులో డబ్బులు లేవు. జైలు నుంచి వస్తున్నప్పుడు తన దగ్గిర వున్న పదిరూపాయలూ అయిపోయాయి. పనికోసం తిరిగి తిరిగి అలిసిపోయాడు.

కూలిపని కూడా దొరకలేదు. కూలివాళ్ళు తనను దగ్గిరకు చేర్చుకోవడానికి భయపడుతున్నారు. 'ఎక్కడినుంచి వస్తున్నా'వని ఎవరైనా అడిగితే తను 'జైలునుంచి' అని సమాధానం చెబుతున్నాడు. దాంతో తన నెవరూ దగ్గిరకు చేరనివ్వడంలేదు.

'ఏం చెయ్యాలి?'మళ్ళీ?...

అతను జైలునుంచి వస్తున్నప్పుడు జైలరు అన్న మాటలు గుర్తువచ్చాయి.

"మిస్టర్ హరికృష్ణా! చదువుకున్నవాడివి. గౌరవంగా బతకడానికి ప్రయత్నించు. మళ్ళీ ఇక్కడకు రాకుండా వుండాలని నా కోరిక."

హరికృష్ణకు నవ్వొచ్చింది.

గౌరవంగా బతకాలని ఎవరికి వుండదూ? కాని సమాజం కొందర్ని గౌరవంగా బతకనివ్వడం లేదు.

హరి కడుపులో ఏదో కిరకిర చుట్టుకుపోతూవుంది. అశాంతిగా వుంది. యాదాలాపంగా నడుస్తున్న హరి ముక్కోళ్ళకు రకరకాల మసాళాలు కలసిన వాసన తగిలింది. చటుక్కున ఆగిపోయాడు.

ఎదురుగా పెద్ద కాఫీహోటల్ కన్పించింది.

**KALPANA STATIONERS**
H.No. 27-6-12, Prakasam Road
Governerpet, VIJAYAWADA - 2

తిన్నగా లోపలకు నడిచాడు.

కడుపునిండా తిని కాఫీ తాగాడు.

సర్వర్ బిల్లు తెచ్చి ఇచ్చాడు.

బిల్లు తీసుకొని కౌంటర్ దగ్గిరకు వచ్చి బిల్లు ముందు పెట్టి "నా పేరు హరికృష్ణ. వుండేది నాంపల్లి సత్రం. రాసుకోండి" అన్నాడు.

కాషియర్‌కు అర్థం కాలేదు.

"వ్హాట్?" అన్నాడు.

అవే మాటలు ఇంగ్లీషులో చెప్పాడు.

"నీ అడ్రస్ మాకెందుకూ! డబ్బు ఇవ్వు!"

"డబ్బులేదు అందుకే అడ్రసు రాసుకోమంటున్నాను. డబ్బు రాగానే ఇస్తాను"

"డబ్బు లేకుండా ఎందుకు తిన్నావ్?"

"ఎందుకు తింటారు ఎవరైనా? ఆకలివేసింది. తిన్నాను!" నిర్భయంగా సమాధానం ఇచ్చాడు హరి.

కాషియర్ కౌంటర్ దిగి వచ్చాడు. హరికృష్ణ షర్టు పుచ్చుకున్నాడు. అప్పటికే చాలామంది నిల్చుని చోద్యం చూస్తున్నారు.

"మర్యాదగా ముందు నా షర్టు వదిలెయ్."

కాషియర్ షర్టు వదిలేశాడు.

"ఏమిటయ్యా జబర్దస్తీ. డబ్బు లేకుండా ఐదు రూపాయలకు తిని పైగా దబాయిస్తావా?"

"మొదట మర్యాదగానే చెప్పాను."

"ఏమిటి మర్యాదగా చెప్పింది? ఊరూ పేరూ లేనివాడివి ...మళ్ళీ చూస్తే ఇంగ్లీషు మాట్లాడుతున్నావ్?"

"ఏం ఇంగ్లీషు నీ అబ్బ భాషా? ఇంకెవరూ మాట్లాడకూడదా?"

"పోలీసులకు రిపోర్టు చెయ్యక ఎందుకయ్యా ఆ రౌడీతో నీకు వాదం!"

హరి వెనక్కు తిరిగి చూశాడు.

ఖద్దరు ధోవతీ, ఖద్దరు సిల్కు లాల్చీలో వున్న పెద్ద మనిషి కన్పించాడు.

"లీడర్ బాబులా వున్నావ్? ఏంచేస్తుంటావు బాబూ, పైరవీలు చేస్తావా లేక..."

"షటప్!"

"అబ్బో ఇంగ్లీషువచ్చిన లీడరులాగున్నావే?"

హోటల్ రూంలో ఎవర్నో కలుసుకొని వస్తున్న ఆనంద బాబా ఖద్దరు లాల్చీ పెద్దమనిషిని చూసి ఆగాడు. అక్కడ జరుగుతున్న రభస గురించి తెలుసుకొని "ఎంత ఇవ్వాలి?" అని క్యాషియర్‌ను అడిగాడు.


*Deepavali Greetings to all our valued Customers, Well Wishers*

**Modern Marketing Enterprises**

**5–8–512/36, ABID SHOPPING CENTRE, HYDERABAD - 500 001.**

**DISTRIBUTORS & STOCKISTS FOR**

Helicord Industrial V Belts, Polar ceiling Fans, Allwyn Refrigerators & Bottle Cooler Gulmarg Air Cooler, Nelco voltage Stabilisers, Kleerton Appliances, Suneet Mixtures etc.

"ఐదు రూపాయల పదిహేను పైసలు," అన్నాడు క్యాషియర్.

బాబా బిల్లు చెల్లిస్తూంటే హరి ఆశ్చర్యంగా చూశాడు.

"మీరెందుకిస్తారు. ఇటువంటి వాళ్ళను జైలుకు పంపిస్తే గాని బుద్ధిరాదు," అన్నది ఖద్దరు సిల్కు-లాల్చీ.

"ఇటువంటివాళ్ళే దేశానికి పనికొస్తారు."

హరి ఆశ్చర్యంగా బాబా ముఖంలోకి చూశాడు.

"మీ అడ్రసు చెబితే నాకు డబ్బు రాగానే తెచ్చిస్తాను. థాంక్యూ." అన్నాడు హరి.

ఆనందబాబా నవ్వుతూ హరి భుజంమీద ఆప్యాయంగా చెయ్యివేశాడు.

"నాతో వస్తావా?" అన్నాడు ఆనందబాబా.

"ఎక్కడికి?"

"చెబుతా రా!" అంటూ కారు దగ్గరకు నడిచాడు.

హరి మంత్రముగ్ధుడిలా బాబా వెనకే నడిచాడు. కార్లో వెనకసీట్లో తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు హరిని బాబా.

"నీ పేరు?"

"హరికృష్ణ!"

"ఏ ఊరు?"

"ప్రస్తుతం ఈ ఊళ్లోనే వుంటున్నాను."

ఓ క్షణం హరి ముఖంలోకి చూశాడు.

"ఈ ఊరు రాకముందు ఎక్కడ వుండేవాడివి? ఎక్కడ నుంచి వచ్చావ్?"

"జైల్లో!" జంకూ గొంకూ లేకుండా అతి సామాన్యంగా చెప్పాడు హరి.

బాబా చివ్వున తలెత్తి హరి కళ్ళల్లోకి లోతుగా చూశాడు.

"ఏంచేశావ్?"

హరి పలకలేదు.

"దొంగతనమా?"

కాదు అన్నట్లు తల ఊపాడు హరి.

"ఛీటింగా?"

మళ్ళీ తల అడ్డంగా ఊపాడు.

"ఖూనీ కేసా?"

హరి ఓ క్షణం బాబా ముఖంలోకి చూశాడు. నిజంగా స్థితప్రజ్ఞుడిలా వున్నాడు! తను జైలునుంచి వస్తున్నాడని తెలిసీ ఎంతో సౌమ్యంగా, అతి మామూలుగా ప్రశ్నిస్తున్నాడు. ఇంకా లోకంలో మంచివాళ్ళు లేకపోలేదు. అందుకే ధర్మం ఒక పాదంమీద కుంటుతూ అయినా నడుస్తూ వుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"


**In the service of the Road Transport**

YOU OWN THE VEHICLE
WE ADVANCE THE MONEY
AND
PAY AS YOU EARN

**THE SAHAYAK FINANCE & INVESTMENT CORPORATION LIMITED.**

Registered Office
**3-6-284, Himayatnagar, Hyderabad-500 001. Post Box No. 132**

B. SREENIVASA RAO
Managing Director

హరి "ఆఁ ఏమీలేదు," అన్నాడు.

"జైలుకు ఎందు కెళ్ళావ్?"

"ఇంటర్వ్యూలో ఒక పెద్ద ఆఫీసర్ని కొట్టాను."

బాబా రెండు క్షణాలు మౌనంగా వున్నాడు.

"ఏం చదువుకున్నావ్?"

"బి.ఏ. ఫస్టుక్లాసులో పాసయాను."

అర్థంఅయినట్టు బాబా తనలో తను నవ్వుకున్నాడు.

"నిరుద్యోగివన్నమాట!"

"అవునండీ! నాకు నాన్న లేడు. చిన్నప్పుడే పోయాడు. అమ్మ కాయకష్టంచేసి నన్ను చదివించింది. నేనేదో పెద్ద ఆఫీసర్ని అవుతాననీ, ఏనాటికైనా తన కష్టాలు గట్టెక్కుతాయనీ అమ్మ కలలుకన్నది. బి.ఏ. పాసయాను. ఉద్యోగ పర్వం ప్రారంభం అయింది. ఎన్నో ఇంటర్వ్యూలకు హాజరైనాను. అమ్మ ఆరోగ్యం క్షీణించింది. మంచం ఎక్కింది. ఆరునెలల క్రితం ఒక ఇంటర్వ్యూకు వెళ్తూ తాడో పేడో తేల్చుకోవాలనుకున్నాను. ఆఇంటర్వ్యూ కూడా బోగస్ అని తెలిసింది. ప్రశ్నలకు తలతిక్క సమాధానాలు చెప్పాను. మాటా మాటా పెరిగింది. కోపంకొద్దీ బల్లమీదవున్న పేపర్ వెయిట్ ఆఫీసర్ ముఖంమీదకు విసిరాను. అంతే! అతని నుదురు చిట్లి రక్తం కారింది. నాకు ఆరునెలలు జైలుశిక్ష పడింది. తన కొడుకు పెద్ద ఆఫీసరు అవుతాడని కలలు కన్న మా అమ్మ నా జైలుశిక్ష గురించి విని ప్రాణాలు విడిచింది. ఇదీ నా కథ!" ఇక నన్నేమీ ప్రశ్నించవద్దు అన్నట్లు ముగించాడు హరి.

"నేను ఉద్యోగం ఇస్తాను. చేస్తావా?"

హరి కళ్ళు మిలమిల లాడాయి.

"నిజంగా ఇస్తారా?" సందేహంగా అడిగాడు.

"ఇస్తాను. ధైర్యం కలవాడివి. నీలాంటి వాడికోసమే నేను ఎంతో కాలంగా వెతుకుతున్నాను. నేను అనాధస్త్రీల కొరకు ఒక ఆశ్రమం నడుపుతున్నాను. దానికి ఒక సెక్రెటరీ కావాలి. ప్రస్తుతం ఒక స్త్రీ వుంది. కాని ఆమెకు ఆఫీసు పనులు చూసుకోవడం అంతగా రాదు."

కారు ఆనందనిలయం ముందు ఆగింది.

బాబాతో పాటు హరి ఆఫీసుగదిలో కూర్చున్నాడు.

మిసెస్ వైకుంఠం వచ్చింది.

"ఇతని పేరు హరి. బి.ఏ. పాసయాడు. మనకు ఉపయోగపడే కుర్రవాడనిపించి తీసుకొచ్చాను. ఇవ్వాల్టినుంచి ఇతను సెక్రెటరీ. నువ్వు వార్డెన్‌వూ...ఇంకా..." అర్ధయుక్తంగా మిసెస్ వైకుంఠం కళ్ళలోకి చూశాడు.

మిసెస్ వైకుంఠం ముసిముసిగా నవ్వుతూ అదోలా చూసింది బాబా కళ్ళలోకి.



"నీకు ప్రస్తుతం నెలకు నూటఏభై ఇస్తాను. ఆ తర్వాత నువ్వు నమ్మకంగా వుంటే...నీకే తెలుస్తుంది ఇది ఎటువంటి ఉద్యోగమో?'' అన్నాడు బాబా.

"ప్రస్తుతం నాకు ఆ జీతం చాలండీ! నమ్మకంగానే వుంటాను. మీరుణం ఈ జన్మలో తీర్చుకోలేను."

''నీ కా భయం అక్కర్లేదు. ఈ జన్మలోనే తీర్చుకోగలవు." నవ్వుతూ అన్నాడు బాబా.

హరికి అర్థంకాలేదు.

''అంత భావగర్భితంగా మాట్లాడితే పాపం ఆ అబ్బాయికేం అర్థం అవుతుంది?'' మిసెస్ వైకుంఠం అన్నది.

"క్రమంగా అతనే అర్థంచేసుకుంటాడు. తెలివైనవాడు. ధైర్యస్థుడు."

హరికి ముఖం ఎలా పెట్టాలో తెలియక తలదించుకొని కూర్చున్నాడు.

''బొత్తిగా నీ దగ్గర డబ్బేమీ వున్నట్టులేదు. ఈ వంద రూపాయలు వుంచు. రేపు పదిగంటలకు వస్తే నువ్వు చెయ్యాల్సిన పని ఏమిటో చెప్తాను."

"థ్యాంక్సండీ! రేపు వస్తాను.''అంటూ డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు హరి.

"అవునూ! బి.ఏ. పాసయాడు. ఎటువంటి భావాలు గలవాడో...మరి మన దగ్గిర...'' సందేహిస్తూ చూసింది మిసెస్ వైకుంఠం.

''నీకా భయం అక్కర్లేదులే. జీవితంలో బాగా చేదును రుచిచూచినవాడే, జైలుకుకూడా వెళ్ళివచ్చాడు.''

"నిజంగా?" మిసెస్ వైకుంఠం ఉత్సాహంగా అన్నది.

''మరి! ఈ ఆనందబాబా అంటే ఏమిటనుకున్నావ్?" మిసెస్ వైకుంఠం దగ్గిరగా వచ్చి భుజంమీద చెయ్యివేశాడు.

మిసెస్ వైకుంఠం సిగ్గుతో మెలికలు తిరగడానికి ప్రయత్నించింది కాని భారీ శరీరం కావడంవల్ల వీలుపడలేదు.

## 9

శాంత నడుస్తూవుంది.

నిద్రలో నడుస్తున్నట్టు నడుస్తూవుంది.

యంత్రంలా, నడుస్తూవుంది.

మనసులో బాధలేదు. బుర్రలో ఆలోచనలేదు. మెదడూ, మనసూకూడా తిమ్మిరెక్కిపోయాయి.

మొరక వీధి మలుపు తిరిగి ఊరిబయట వున్న మర్రిచెట్టు దగ్గిరకు వచ్చింది.

ఒకప్పుడు ఆ మర్రిచెట్టు దగ్గిరకు రావాలంటే శాంతకు తగని భయం. ఆ మర్రిచెట్టు గురించి అనేక కథలు వున్నయ్. ఇటీవల బావిలోపడి చచ్చిపోయిన ఆదెమ్మ


ఫోన్: 38481 (5 లైన్లు) గ్రామ్స్: 'HEAVEN'

HOTEL firdaus

లేక్ హిల్ రోడ్, హైదరాబాద్-500 004

ప్రత్యేక వసతులు...

ఎయిర్ కండిషన్డ్ గదులు — రుచి, శుచికరములైన భారతీయ, పాశ్చాత్య భోజన వసతులు — వేడినీటి సదుపాయం, అన్ని గదులలో టెలిఫోన్, నాలుగు ఛానల్స్‌గల మ్యూజిక్, ప్రతి గదిలోనూ మెత్తటి తివాచీలు పరచబడి, అత్యాధునికంగా అలంకరించబడి, జంటనగరాలలోగల అన్ని ముఖ్య కేంద్రాలకు అతి చేరువలో వుంది. మీ సమావేశములకు కాన్ఫరెన్స్ హాల్, మరియు 'సెల్లార్ బార్' కూడా గలదు.

మీరు జంటనగరాలకు విచ్చేసినప్పుడు మీకు మా ఆహ్వానము

కూడా దెయ్యం అయి ఆ మర్రిచెట్టుమీదే స్థావరం ఏర్పరచుకున్నదని అనుకోవడం కూడా విన్నది శాంత. శాంతకు దెయ్యాలంటే భయం.

ఇప్పుడు శాంత మనసు అన్ని భయాలకూ అతీతంగా వుంది.

మర్రిచెట్టు కిందకు వచ్చింది. చెట్టు మొదల్ని ఆనుకొని కూర్చుంది.

మర్రి ఊడల నీడలు గుడ్డి వెన్నెల్లో నేలమీద పాకుతూ అల్లంత దూరంలో వున్న బావిలోకి దిగి కలసిపోతున్నాయ్.

శాంత రెండు మోకాళ్ళ సందునా ముఖం ఇరికించుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది.

దూరంగా ఏదో కూనిరాగం వినిపించి చివ్వున తలెత్తింది శాంత. దూరంగా, వెన్నెల్లో మానవాకారం ఒకటి మర్రిచెట్టు వైపుకే నడుస్తూ రావడం కన్పించింది. శాంత కళ్ళు తుడుచుకుని చూసింది. ఆ ఆకారం దగ్గరౌతుంది. చివ్వున లేచి నిల్చుంది శాంత.

కూనిరాగం ఆగిపోయింది. ఆ ఆకారం ఓ క్షణం నిలబడిపోయింది.

ఎవరో వస్తున్నారు. మర్రిచెట్టు కింద తనను చూసి దెయ్యం అనుకున్నట్టున్నాడు. భయంతో బిగిసిపోయి నిలబడిపోయాడు. శాంతకు అంత దుఃఖంలోనూ నవ్వొచ్చింది.

ఆ ఆకారం కదిలింది. వడివడిగా ముందుకు వస్తూవుంది.

ఎవరో ఆ వస్తున్నది? నాన్నేమో? తనకోసం వెతుక్కుంటూ వస్తున్నాడేమో?

శాంత బావికేసి నడిచింది.

బావిగట్టు ఎక్కి కూర్చుని బావిలోకి తొంగిచూసింది.

తల్లి గుర్తొచ్చింది. తండ్రి గుర్తొచ్చాడు. రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది.

బావిలో పడిపోయాను అనుకున్న శాంత కొద్ది క్షణాల తర్వాత గాని తను ఎవరి చేతుల్లోనో వున్నట్టు తెలుసుకోలేదు.

'కెవ్వు' మన్నది.

ఆ వ్యక్తి శాంతను అమాంతం ఎత్తుకొచ్చి మర్రిచెట్టు కింద వున్న ఓ పెద్ద బండమీద కూర్చోబెట్టాడు.

ఎదురుగా పైజామాలాల్చీలో పొడువుగా నిల్చుని వున్న యువకుణ్ణి చూసింది శాంత.

శాంత నిలువెల్లా కంపించిపోయింది

శాంత బెదురుచూపులు చూస్తూ లేచి నిల్చుంది.

"ఎందుకంత వణికిపోతున్నావ్? నేను మృత్యువుకంటే కూడా భయంకరంగా కన్పిస్తున్నానా?" అతని కంఠంలోని ఆత్రుతను గుర్తించే స్థితిలో లేదు శాంత.

అంతకుముందు జరిగిన అనుభవం కళ్ళముందు కదిలింది.

మళ్ళీ ఇతను...గజగజలాడిపోయింది.

"నేను నిన్నేం దెయ్యమనుగాని అలాకూర్చో!"

దెబ్బతిన్న లేడిలా దీనంగా చూసింది.

"కూర్చుంటావా లేక నన్ను కూర్చోబెట్టమంటావా?"

అతను ఒకడుగు ముందుకు వేశాడు.

శాంత ఒక్కసారిగా బండమీద కూర్చుంది.

ఆ యువకుడికి నవ్వొచ్చింది. కాని నవ్వలేదు.

"నీ పేరేమిటి" అతను కూడా ఎదురుగావున్న చిన్న రాతిమీద కూర్చున్నాడు.

శాంత మాట్లాడలేదు. బేల చూపులు చూసింది.

"నేను అడిగిందానికి సమాధానం చెప్పు. లేకపోతే పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్తాను."

శాంత బావురుమని ఏడ్చింది.

"ఊరుకో! అలా ఏడ్చి లాభంలేదు నీ పేరేమిటి?"

"శా...శాంత!"

"ఈ ఊరేనా?"

"అవును!" అన్నట్టు తల ఊపింది ఏడుస్తూనే.

"అయితే పద! మీ ఇంటికి పంపించి వస్తాను."

శాంత తృళ్ళిపడింది. బెదిరిపోయింది.

"వద్దు! వద్దు! నేను ఇంటికి వెళ్ళను, వెళ్ళలేను." బెక్కుతూనే అన్నది.

అతనికి అర్థంఅయింది ఏదో జరగరానిదేదో జరిగిందని.

ఇంత చిన్న వయసులో ఆ పిల్ల ఎందుకు ఆత్మహత్యకు పాల్పడుతుంది?

యవ్వనపు పొంగులో, మంచిచెడూ తెలుసుకోలేని వయసులో, ఎవర్నయినా ప్రేమించి మోసపోయి వుండాలి. లేక ఏ దుర్మార్గుడైనా ఈ పిల్ల శీలాన్ని కాజేసి వుండాలి.

ఈ వయసులోని ఆడపిల్లల కథలన్నీ దాదాపు ఒకటిగానే వుంటాయి.

ఈ అమ్మాయిని అడిగినా నిజం చెప్పదు. తెలుసుకొని తను చేసేది కూడా ఏమీ లేదు.

అతను ఆలోచనలో వుండడంచూసి శాంత బావి దగ్గిరకు పరుగు తీసింది.

అతను చివ్వున లేచి ఆమెను పట్టుకున్నాడు.

"నన్ను వొదులు."

"ఎక్కడికి వెళ్ళాలని? బావిదగ్గిరకేనా?"

"నీకు అనవసరం!" ధైర్యాన్ని కూడగట్టుకొని అన్నది కాంత.

"ఈ జీవితం మనం కావాలని కోరుకుంటే లభించింది కాదు. దీనిని అంతంచేసే అధికారం కూడా మనకు లేదు. నామాట విని ఇంటికి వెళ్ళు. నేను కూడా వస్తాను పద!"

"నేను వెళ్ళను."

"అయితే నాతో వస్తావా ?"

కాంత చివ్వున తలెత్తి చూసింది.

"భయపడకు. నేను నిన్నేమీ చెయ్యను. నాతో రా ! ఆనందనిలయంలో చేర్పిస్తాను. అక్కడ నీలాంటి ఆడ పిల్లలు చాలామంది వుంటారు. చదుకోవచ్చు, కావాలంటే మంచి సంబంధం చూసి పెళ్ళికూడా చేస్తారు."

కాంతకు అతని మాటల్లో నమ్మకం కలగలేదు. సమాధానం ఇవ్వలేదు.

"వస్తావా ?"

"రాను !"

"మరి ఎక్కడి కెళ్తావ్?"

"నా ఇష్టం ! ఎక్కడికో వెళ్తాను. నీకు అనవసరం. నువ్వెళ్లు," అన్నది.

"అలా వెళ్ళేవాణ్ణి కాదు. నాతో వస్తేరా. లేకపోతే పోలీసుస్టేషన్‌కు పద. లేదా నాతో రా! నేను నిన్ను ఏమీ చెయ్యను. ఆశ్రమంలో చేర్పిస్తాను."

కాంత మాట్లాడలేదు.

"ఆలోచించుకో, నిన్ను మాత్రం ఇలా వదలి వెళ్ళను. కారణం నాకు అనవసరం. నువ్వు ఇంటికివెళ్ళే పరిస్థితిలో లేవు. ఆనందనిలయంలో కొంతకాలం వుండి చూడు. నీకు అక్కడ బాగా వుంటేనే వుండు, లేదా వెళ్ళిపోవచ్చు."

కాంత అతని ముఖంలోకి చూసింది. కళ్ళల్లోకి చూసింది. మౌనంగా లేచి నిల్చుంది.

"ఏమిటి, వస్తావా?"

"వస్తాను !"

## 8

ఆనందబాబాను గేట్లోనే కలుసుకుంది మిసెస్ వైకుంఠం.

"ఏమిటి చాలా ఉషారుగా వున్నట్టున్నావ్ ? ' అన్నాడు బాబా.

"మొత్తం మీద మంచి కుర్రాణ్ణే పట్టుకున్నారు," నవ్వుతూ అన్నది.

"ఎవరు ? హరికృష్ణ విషయమేనా ? వచ్చాడా ?"

"ఆ వచ్చాడు. వొంటరిగా రాలేదు. తెల్లవారేప్పటికి అప రంజి బొమ్మలాంటి ఒక అమ్మాయిని కూడా పట్టుకొచ్చాడు."

"నిజంగా ?"

"ఎక్కడుంది ఆ పిల్ల?"

"స్నానంచేస్తూ వుంది. చాలా అమాయకురాలులా వుంది."

"నీ ట్రెనింగులో ఎంతసేపులే..." కొంటెగా చూశాడు ఆనందబాబా.

మిసెస్ వైకుంఠం ముసిముసిగా నవ్వుకుంది."

"హరికృష్ణ ఎక్కడ ?"

"ఆఫీసుగదిలో వున్నాడు."

ఆనందబాబా ఆఫీసుగదిలో ప్రవేశించగానే హరి లేచి నమస్కరించాడు.

"కూర్చో! నువ్వు చెయ్యాల్సిన పని ఇది అంటూ ప్రత్యేకంగా వుండదు. అకౌంట్సు మెయిన్‌టైన్ చెయ్యాలి. ఆ తర్వాత ఆశ్రమం మంచి చెడ్డలు చూసుకోవాలి. మనందరం ఒక్క కుటుంబంలోని వాళ్ళలా మెసులుకోవాలి. ఇక్కడి రహస్యాలు బయటకు వెళ్ళకూడదు," అన్నాడు బాబా.

"అలాగేనండి !" అన్నాడేకాని "ఇక్కడ రహస్యాలేముంటాయబ్బా !" అని ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?"

"అబ్బే! ఏమీ లేదండి!"

"ఎవరో అమ్మాయిని తీసుకొచ్చారట ! ఎవరా అమ్మాయి ?"

"నాకూ బాగా తెలియదండీ. ఆత్మహత్య చేసుకోబోతూ వుంటే తీసుకొచ్చాను."

జరిగినదంతా చెప్పాడు హరికృష్ణ.

"గుడ్ !" అని ప్రశంసాపూర్వకంగా హరికృష్ణ మొహంలోకి చూసి ఆశ్రమంలోపలి కెళ్ళాడు బాబా.

మిసెస్ వైకుంఠం ఆనందబాబాను కాంత వున్న గదిలోకి తీసుకెళ్ళింది.

కాంత జంకుజంకుగా నిల్చుంది.

"ఏమ్మా ! ఇక్కడ బాగుందా ?" ఆపాదమస్తకం పరిశీలనగా చూస్తూ అడిగాడు ఆనందబాబా.

కాంత కంఠం పెగల్లేదు. తల ఊపింది.

బాబా నవ్వుతూ దగ్గరకు వస్తూవుంటే శేషాచలం కళ్ళముందు మెదిలాడు.

కాంత భయంభయంగా చూసింది.

"భయపడుకు," అంటూ ఆనందబాబా కాంత తలమీద చెయ్యిపెట్టి రాస్తూ వీపువరకూ తెచ్చాడు ఆ చేతిని.

కాంత దూరంగా జరిగింది.

"నేను నీ తండ్రిలాంటి వాడిని. ఎందుకు బెదిరిపోతావ్!" అంటూ మళ్ళీ వీపుమీద చెయ్యి వేశాడు.

శాంతకు తండ్రి గుర్తొచ్చాడు.

తండ్రి ఎన్నోసార్లు తనను బుజ్జగిస్తూ తలమీద చెయ్యి వేశాడు. కాని ఆ స్పర్శలోవున్న ఆప్యాయత లేదు.

పైగా ఆనందబాబా చెయ్యి మీదపడగానే శేషాచలం గుర్తొచ్చాడు

"సంయుక్త ఏమంటుంది?"

"అట్లాగే మొండిగా వుంది. చూస్తే మరో పెళ్ళి చేసుకో నంటున్నది,'' మిసెస్ వైకుంఠం సమాధానం ఇచ్చింది.

''దానికి అలా బుద్ధిరాదు. నాగేంద్రానికి అప్పగించు." అంటూ బాబా బయటికి వెళ్ళిపోయాడు.

మానసికంగా, శారీరకంగా బాగా అలసిపోయిన శాంత పడుకుంటూనే నిద్రపోయింది.

## 9

యాదగిరివచ్చి తలుపులు తట్టేవరకు శేషాచలం నిద్ర లేవలేదు.

"ఏంది దొరా! ఇంకా నిద్రపోతున్నారు! పాణం బాగా లేదా?" యాదగిరి అడిగాడు.

"అవున్రా యాదా! కొంచెం జ్వరం వచ్చింది."

"ఇ దిన్నారా? శాంతమ్మ కనిపించడం లేదంట రాత్రి నుంచి."

శేషాచలం గతుక్కు మన్నాడు. యాదగిరి ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

"అళ్ళమ్మ ఒకటే ఏడుపు!"

"ఏమయిందో?" తనకు తానే ప్రశ్నించుకుంటున్నట్టు అన్నాడు.

"అందరూ ఏదేదో అంటున్నారు. కాని శాంతమ్మ అట్టాంటిది కాదు.'' యాదగిరి బాధగా అన్నాడు.

శేషాచలం ఆలోచనలో పడ్డాడు.

ఏమైవుంటుంది? ఆత్మహత్య చేసుకుందా? తను ఎంత పాపం చేశాడు? తన కూతురులాంటి పిల్లను... ఆపై ఆలోచించలేక పోయాడు.

యాదగిరి ఏదేదో అంటున్నాడు. ఒక్కమాటకు కూడా సరిగా అర్థం బోధపడడం లేదు.

"నాకు ఒంట్లో బాగా లేదు. కాసేపు పడుకుంటాను." అంటూ గదిలోకి వెళ్ళిపోయాడు శేషాచలం.

ఆ సాయంత్రం పురాణం వినడానికి శ్రోతలు వచ్చారు. శేషాచలం తన ఒంట్లో బాగాలేదనీ, పురాణం చెప్పలేననీ చెప్పాడు.

ఆనాడు పురాణ కాలక్షేపం మీదికి ఎవరి మనసూ పోవడం లేదు. సీతాపతి కూతురు శాంత గురించిన చర్చే సాగింది. తలా ఒక మాటా అంటున్నారు. శేషాచలం మౌనంగా కూర్చున్నాడు.

''వయసులో వున్న పిల్ల. రాత్రి మాయం అయిం దంటే...?'' ప్రశ్న వదిలేశాడు నర్సయ్య.

''ఎవడితోనో లేచిపోయి వుంటుంది.'' ఆ ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు వీరభద్రయ్య తడుముకోకుండా.

"శాంత మంచి పిల్ల. నాకు చిన్నప్పటినుంచీ తెలుసు." సీరసంగా అన్నాడు శేషాచలం.

"మంచి పిల్లే కావచ్చు. ఆ వయసు అలాంటిది. మరి ఆ తండ్రి పెళ్లిమాటే తలపెట్టకపోతే ఏం చేస్తుందేమిటి?" అన్నాడు నర్సయ్య.

ఎవరికి తోచిన మాట వాళ్ళు అన్నారు.

శేషాచలం పురాణ కాలక్షేపం మానేశాడు. నాలుగు రోజులైనా బయటి ముఖం చూడలేదు. వీరభద్రయ్యకూడా రావడంలేదు.

ఐదోరోజు రాత్రి సీతాపతి ఇంట్లోనుంచి ఘొల్లున ఏడ్పులు వినిపించాయి.

యాదగిరి పరిగెత్తుకెళ్ళి విషయం కనుక్కుని వచ్చాడు. సీతాపతి భార్య చచ్చిపోయింది. అసలే జబ్బులోవున్నది కనకమ్మ. కూతురు పారిపోవడాన్ని భరించలేకపోయింది. కూతురు ఏమైందోననే బాధకంటే, నలుగురూ ఏమనుకుం టున్నారోఅనే బాధ ఆమెను మరీ కుంగదీసింది.

ఆవార్త విన్న శేషాచలం క్షణకాలంపాటు స్థంభించి పోయాడు.

మనసు మధనపడ సాగింది. ఆమెను తనే చంపినట్టు అనిపిస్తూ వుంది.

శేషాచలం సీతాపతి ఇంటికి వెళ్ళాడు. శవాన్ని లేప డానికి కూడా ఇంట్లో డబ్బులేదని గ్రహించాడు. ఇంటికి తిరిగి వచ్చాడు. వెయ్యి రూపాయలు తీసుకెళ్లి గోడకు చేర బడి కూర్చుని వున్న సీతాపతి చేతిలో పెట్టాడు.

"ఇంత డబ్బా? మళ్ళీ ఎలా తీర్చగలను?" అన్నాడు సీతాపతి.

సీతాపతి ఏడవడంలేదు. మనసు దుఃఖాన్నికానీ, సుఖాన్ని కానీ ఒక హద్దువరకే అనుభవించగలదు. ఆ తర్వాత సుఖ మైనా దుఃఖమైనా ఒకటే. కూతురు కన్పించక పోవడంతో లోతుగా గాయపడిన అతని మనసు మీద భార్యచావు, చావు దెబ్బ కొట్టింది.

"ఫర్వాలేదు. వుంచు. కష్టంలో ఆ మాత్రం సహాయ పడటం నా ధర్మం. ఎంతోకాలంగా ఒక కుటుంబంలా కలిసి మెలిసి వున్నాం.'' అన్నాడు శేషాచలం.

సీతాపతి కృతజ్ఞతా సూచకంగా రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు.

శేషాచలానికి మనసులోని పాపభారం కొంత తగ్గినట్టు అనిపించింది.

వారం రోజులు గడిచిపోయినా వీరభద్రయ్య కన్పించ లేదు. శేషాచలానికి ఆరోజు మరీ పిచ్చిగావుంది. ఏమీ తోచకుండావుంది.

వీరభద్రయ్య ఏమైనాడో? వయసు మళ్ళిన వాడికి ఇంట్లో పడుచు పెళ్లాం! ఇంకా బయటికేం వస్తాడు! ఇప్పుడు ఏం చేస్తున్నాడో,

శాంతతోటి అనుభవం గుర్తువచ్చింది. మధురమైన ఊహల్లో కొద్ది క్షణాలు మైమరచిపోయాడు. అంతలోనే సీతాపతి కుటుంబం తనవల్ల సర్వనాశనం అయిందని జ్ఞాపకం వచ్చింది. 'భగవాన్! ఈ పాపిని క్షమించు!' మనసులోనే అనుకున్నాడు.

వీరభద్రయ్య వచ్చాడు. తన యావదాస్తీ మోసుకొని వస్తున్న ఓడ నడిసముద్రంలో మునిగిపోయిందన్న వార్త విన్నవాడిలా వున్నాడు. కళ్ళు లోతుకుపోయాయి. బుగ్గలు పీక్కుపోయాయి. జుట్టుకు రంగుపోయి తెల్లగావుంది. తెల్ల జుట్టు మధ్య రాగి వర్ణం కన్పిస్తూవుంది. అకస్మాత్తుగా పదేళ్లు పైబడ్డవాడిలా వున్నాడు.

శేషాచలం పరీక్షగా చూశాడు.

"ఏమయ్యా! అలా వున్నావేం! జబ్బుచేసిందా?"

"ఏం చెప్పను?" గొంతుకు ఉంగిడిపడ్డ గొడ్డులా చూశాడు.

''ఏమిటి? ఏం జరిగింది?'

"ఆ ముండ నా కొంప ముంచింది. నా పరువు తీసింది.'' గొంతు పెగుల్చుకుంటూ అతి కష్టంతో అన్నాడు వీర భద్రయ్య.''

శేషాచలానికి అర్థంకాలేదు. ఆశ్చర్యంగా చూశాడు.

"ఏమిటి? ఏమైంది?''

"ఆ ముండ నగలన్నీ పెట్టుకొని ఎటో పారిపోయింది."

ఆ సంగతి తను ఏనాడో ఊహించినట్టే ముఖం పెట్టాడు. శేషాచలం.

"పారిపోయిందా? చాలా మంచిదనీ, నువ్వంటే ప్రాణం విడుస్తుందనీ తెగ ఊదరకొట్టావు గదయ్యా?"

''అట్లాగే అనుకున్నాను. ఆ ముండ నన్ను అంత నమ్మించింది. ఎంత నాటకం ఆడిందనుకున్నావ్?"

"నేనంటే విన్నావా?"

''ఎంత లేదన్నా ఆ నగలు పదివేల ఖరీదు చేస్తాయ్!''

"డబ్బుసంగతి అలా వుంచవయ్యా! వలానావాడి పెళ్లాం లేచిపోయిందంటే ఎంత అప్రదిష్ట! హవ్వ!'' ముక్కు మీద వేలు వేసుకున్నాడు శేషాచలం.

"ఛ! అది పెళ్లాం ఏమిటి? డబ్బిచ్చి కొనుక్కున్న ముండ!"

"ఇప్పుడంటున్నావ్ ఆ మాట అందరూ పెళ్లిచేసుకున్నా వనేగా అనుకోవడం! పైగా 'నా భార్య...నా భార్య' అంటూ ఒకటే మురిసిపోయావు గదయ్యా?''

వీరభద్రయ్య చేదు మింగుతున్నట్టు ముఖం పెట్టాడు.

"అందుకే ఈ వయసులో పెళ్ళేమిటి అన్నాను "

"కర్మ! కర్మ!"

నొసలు బాదుకున్నాడు వీరభద్రయ్య.

వీడే తనలో దుష్టశక్తుల్ని పురికొల్పాడు. పాపపు తలంపు రేకెత్తించాడు. వీడు లొట్టలు వేసుకుంటూ తన శృంగార క్రీడలు వర్ణించి చెప్పబట్టేగా తనలో పాడు ఆలోచనలు తలెత్తాయి?

తను చేసిన పాపంలో సగభాగం వీరభద్రయ్యకే చెందుతుంది.

"ఎంత మురిసిపోయావయ్యా!"

"సరేలేవయ్యా! నీ దెప్పిపొడుపులేమిటి, అసలే నేను కుమిలి కుమిలి చస్తుంటేనూ?" విసుక్కున్నాడు వీర భద్రయ్య.

కొంతసేపు ఇద్దరూ మౌనం వహించారు.

"ఎక్కడికి పోయి వుంటుదంటావ్?"

"అది తెలిస్తే ఈ ఏడుపు ఎందుకూ?"

"ఆనంద నిలయానికే చేరిందేమో! వెళ్ళి చూడక పోయావ్?"

"అదీ అయింది. అక్కడకు రాలేదట. పైగా వాడు— ఆ బాబాగాడు—దొంగ వెధవ-నన్ను బెదిరించాడు."

"ఏమన్నాడేమిటి?"

"నేనే ఆ అమ్మాయిని ఏదో చేసినట్టు మాట్లాడాడు. పైగా పోలీసులకు రిపోర్టు ఇస్తానన్నాడు."

మహా బాగా అయింది. లేకపోతే ఈ వయసులో పెళ్ళట వెళ్ళి! శేషాచలానికి ఏదో సంతృప్తిగా వుంది.

"రిపోర్టు ఇస్తానన్నాడా, ఇచ్చాడా?"

"అసలే తలెత్తుకోలేకుండా వున్నాను. పైగా పోలీసులు సోదాకూడా ఒకటా? వెయ్యి రూపాయలు లంచం ఇచ్చి కాళ్లావెళ్లా పడ్డాను." దాదాపు ఏడుస్తున్నట్టే అన్నాడు వీరభద్రయ్య.

"సిలుం బాగానే వదిలినట్టుంది?"

"చిన్నగా అంటావేం! పెళ్ళి పెటాకులూ అంటూ ఆరు వేలు గుంజాడు. ఆ ముండ పదివేలదాకా కొట్టుకుపోయింది.

"కృష్ణా రామా! అనుకొనే వయసులో మరి పెళ్ళేమిటయ్యా?"

"కర్మ అన్నానుగా!"

"నువ్వు కూడా అలా ఢీలా పడిపోయావేం ?"

"అబ్బే, నేనేం ఢీలా పడలేదే? వంట్లో కొంచెం నలతగా వుంది. అంతే!" తడబడుతూ అన్నాడు శేషాచలం.

"నా మనసేం బాగాలేదు. తీర్థయాత్రలకన్నా వెళ్దాం అని వుంది."

"నాకూ అలాగే వుంది. నేనూ వస్తానుపద!" అన్నాడు శేషాచలం.

"అయితే ఎల్లుండి మంచిది బయలుదేరుదాం!"

"అలాగే మనకేం బాదరబందీ వుంది కనక? అలాగే వెళ్దాం!" అన్నాడు శేషాచలం కొంత తేలికపడ్డ మనసుతో.

తోడు దొంగలిద్దరూ పాప ప్రక్షాళనకోసం తీర్థాలు సేవించడానికి నిర్ణయించుకొని ఆ రాత్రి హాయిగా నిద్రపోయారు.

## 10

ఆఫీసుగదిలో కూర్చొని లెక్కల పుస్తకాలు చూస్తున్న హరికృష్ణకు లోపల ఎవరో 'కెవ్వు' న అరిచిన ట్లైతలెత్తాడు మళ్ళీ అరుపు వినిపించింది. అది లోపల నుంచేనని అర్థం అయింది. హరి లేచి గబగబా శరణాలయం లోపలకు వెళ్ళాడు.

వరండాలో పరిగెత్తుకొచ్చిన ఆడపిల్లల్ని వాళ్ళ వాళ్ళ గదుల్లోకి వెళ్ళమని మిసెస్ వైకుంఠం గదమాయించింది.

హరిని చూసి "ఏమీలేదు. నువ్వెళ్లి నీ పని చూసుకో." అన్నది.

అంతలో ఒక గదిలోనుంచి మళ్ళీ అరపు వినిపించింది. ఆ గది తలుపులు వేసివున్నాయి.

హరి గబగబా వెళ్ళి తలుపులు నెట్టాడు. అవి తెరుచుకోలేదు మిసెస్ వైకుంఠం వారిస్తున్నా వినిపించుకోకుండా 'దబదబా' తలుపులు బాదాడు.

తలుపులు తెరుచుకున్నాయి జుట్టురేగి, పైట చెదిరిపోయి గజగజ వణికిపోతూ ఓ మూలగా నిల్చుని వుంది సంయుక్త. నాగేంద్రం తలుపు తెరిచి 'ఏమిటి' అన్నట్టు హరిముఖంలోకి చూశాడు.


*With best compliments from :*

HOTEL EMERALD

Abid Road

Hyderabad-500001.

హరి ఓ క్షణం విస్మయంగా సంయుక్తనూ, నాగేంద్రాన్నీ మార్చి మార్చి చూశాడు.

"ఏమిటి నువ్వు చేస్తున్నది?" కోపంగా గద్దించాడు నాగేంద్రాన్ని హరి.

"నీ కనవసరం. నీ ఉద్యోగం నువ్వు చూసుకో." అన్నాడు నాగేంద్రం.

"నా ఉద్యోగమే చూస్తున్నాను. నేను ఈ నిలయానికి సెక్రెటరీని." అన్నాడు హరి.

"చూడు బాబూ! ఆ పిల్ల పిచ్చిది. అప్పుడప్పుడు మన వశం తప్పుతుంది. నాగేంద్రం తప్ప ఆ అమ్మాయిని ఎవరూ అదుపులో పెట్టలేరు నువ్వెళ్ళి నీ పని చూసుకో." అన్నది మిసెస్ వైకుంఠం.

"లేదు. నాకు పిచ్చిలేదు. నేను పెళ్లిచేసుకోనన్నానని నన్ను 'రేప్' చేస్తానని బెదిరిస్తున్నాడు." ఏడుస్తూ అన్నది సంయుక్త.

"ఆమె చెప్పేది నిజమేనా?" గద్దిస్తూ అడిగాడు హరి.

"షటప్. నీకు నేను సమాధానం ఇవ్వాల్సిన అవసరంలేదు." అంటూ ముందుకు రెండు అడుగులు వేసిన నాగేంద్రం షర్టుపట్టుకొని ఆపి ఆ చెంపా ఈ చంపా వాయగొట్టాడు.

దాంతో నాగేంద్రం హరితో కలియబడ్డాడు. హరి చేతుల్లో నాగేంద్రం బాగా దెబ్బలు తిన్నాడు.

ఆడపిల్లలంతా తమ తమ గదుల్లోంచి తొంగిచూస్తున్నారు. ఆశ్చర్యంగా.

మిసెస్ వైకుంఠం, హడావిడిగా వెళ్లి ఆనందబాబాకు ఫోన్‌చేసి వెంటనే బయలుదేరి రావలసిందిగా చెప్పింది.

హరి చేతిలో చావుదెబ్బలుతిన్న నాగేంద్రం దెబ్బతిన్న పాములా బుసలు కొడుతూ గడపలమీద కూర్చున్నాడు.

సంయుక్త దగ్గిరకు వెళ్లి "భయపడకమ్మా! నీకేం భయం లేదు." అన్నాడు హరి.

ఆ అమ్మాయి అకస్మాత్తుగా వచ్చి హరికాళ్లకు చుట్టుకుంది.

"నాకు పెళ్లివద్దు. నేను వెళ్ళిపోతాను. మా ఇంటికి పంపించండి." అంటూ భోరున ఏడ్చింది.

"అలాగే పంపిస్తాను. భయపడకు." అని ఓదార్చాడు హరి.

సంయుక్త హరికి తను ఎలా ఆ నిలయానికి చేరుకుందీ ఏడుస్తూనే చెప్పింది.

హరికి ఆశ్చర్యం వేసింది. అనాధల రక్షణకోసం అంటూ చెప్పబడే నిలయంలో జరుగుతున్నది ఇదా!


*With best compiments from :*

**SRI RAMA & CO.,**

**Esamiah Bazar,**

**HYDERABAD-500027.**

**Phone : 51828**

PRINTERS' PROVIDERS & DISTRIBUTORS FOR J. B. A. PRINTING INKS PVT. LTD., MADRAS—DEALERS IN PRINTING MACHINES, CUTTING MACHINES, WIRE STITCHING MACHINES AND COMPLETE ACCESSORIES OF LEAD, LEAD RULES, SPACING MATERIALS ETC.

హరి వరండాలో నిల్చున్న అమ్మాయిలకేసి చూశాడు. శాంత బిక్కు బిక్కుమంటూ హరి ముఖంలోకి చూసింది. శాంత అక్కడికివచ్చి మూడు రోజులైంది. హరి ఆతర్వాత ఇదే చూడటం.

''భయపడకు. నీకెలాంటి అపకారం జరగనివ్వను." అన్నాడు శాంతతో.

అంతలో ఆనందబాబా హడావిడిగా వచ్చాడు.

జరిగిదంతావిని ఆనందబాబా నాగేంద్రాన్ని చెడామడా తిట్టాడు. మిసెస్ వైకుంఠాన్ని కూడా కసురుకున్నాడు. ఆడపిల్లల్ని ఓదార్చాడు. హరిని ప్రశంసించాడు.

నాగేంద్రం,మిసెస్ వైకుంఠంముందుతెల్లబోయారు.ముఖముఖాలు చూసుకున్నారు. నాగేంద్రం కోపంలో ఏదో అనబోతూవుంటే మిసెస్ వైకుంఠం కళ్ళతోనే వారించింది.

హరి ఆనందబాబాతో ఆఫీసు గదిలోకి వచ్చాడు.

"మీకు తెలియకుండా చాలా దారుణాలు జరుగుతున్నట్టు ఉన్నాయి?" అన్నాడు హరి, బాబా ముఖంలోకి చూస్తూ.

బాబా కొంచెంసేపు మౌనంగా ఆలోచిస్తున్నట్టు కూర్చున్నాడు.

"అలాగే వుంది. ఈ మధ్య నాకూ కొంచెం అనుమానంగానే వుంది. అందుకే నీలాంటి కుర్రవాడు అవసరం అనుకొని నీకీ ఉద్యోగం ఇచ్చాను." అన్నాడు బాబా గంభీరంగా.

మధ్యాహ్నం తర్వాత హరికి ఏదో పని పురమాయించి బయటికి పంపించాడు బాబా.

హరి బయటికి వెళ్ళగానే మిసెస్ వైకుంఠం సుడిగాలిలా ఆఫీసుగదిలోకి వచ్చింది. ఆమె వెనకే నాగేంద్రం వచ్చాడు.

బాబా వాళ్ళని చూసి చిరునవ్వు నవ్వారు.

''ఇదేం బాగాలేదు." మిసెస్ వైకుంఠం అన్నది.

''ఏది?" నవ్వుతూనే ప్రశ్నించాడు బాబా.

"వాడిముందు మనల్ని చులకన చెయ్యడం?''

"కొత్తగదా? ఇంకా యువకుడు. పైగా చదువుకున్నవాడు. న్యాయం-అన్యాయం-అంటూ అరిచే తత్త్వం గలవాడు...."

"అటువంటివాణ్ణి ఇక్కడ చేర్చడం ఎంత ప్రమాదకరమో వూహించారా?''

"ఏం ఫర్వాలేదు. క్రమంగా వాడే మారతాడు."

"మారకపోతే మన గుట్టూ మట్టూ కనుక్కొని పోలీసులకు రిపోర్టు ఇస్తే?'' మిసెస్ వైకుంఠం భయపడుతూ అన్నది.

ఆనందబాబా పకపక నవ్వాడు.

*With best compliments of:*

**BIOLOGICAL EVANS LIMITED**

18/1 & 3, Azamabad, Hyderabad - 500 020.

"పోలీసులా? ఎవరు వాళ్లు నన్ను అనుమానించే వాళ్లు? వాడి విషయం—మార్తాడా—వాడికీ— మనకూ కూడా మంచిదే. మారకపోతే వాడికే నష్టం! వాడి సంగతి నేను చూసుకుంటాను. మీరు కలుగజేసుకోవద్దు ఒక కంట కని పెట్టి వుండండి "

మిసెస్ వైకుంఠానికీ నాగేంద్రానికీ హరి విషయంలో ఎలా ప్రవర్తించాలో బోధించాడు.

హరి ఉద్యోగంలోచేరిపదిరోజులైంది. ఆవాతావరణంలో ఏదో అపశృతి వున్నట్టు తోచింది. అనాథల రక్షణపేరుతో భక్షణ జరుగుతున్నట్టు అనుమానం కలిగింది. అక్కడి గుట్టు లాగడానికి నిశ్చయించుకున్నాడు కొంతకాలం నమ్మకగా మెదిలితే గాని అక్కడి వ్యవహారాలు పూర్తిగా అర్థం చేసుకోవడానికీ, ఆ దారుణాలను అరికట్టడానికి వీలుపడదని గ్రహించాడు. ఆ నమ్మకాన్ని సంపాదించ డానికి బాబా చెప్పిన ప్రతి పనీ చెయ్యసాగాడు.

సంయుక్త వివాహం ఆగిపోయింది.

వీలు చిక్కినప్పుడల్లా కాంతకు ధైర్యం చెబుతున్నాడు. అక్కడ జరుగుతున్న విషయాలను శ్రద్ధగా గమనించ వలసిందిగా హెచ్చరించాడు.

ఆ రోజు మధ్యాహ్నం హరి వచ్చేటప్పటికి వరండాలో కలకలంగా వుంది. ఆడపిల్లలంతా ఎవర్నో చుట్టుముట్టి అనేక ప్రశ్నలు వేస్తున్నారు. నాగేంద్రం కొంచెందూరంగా నిల్చుని బీడీ కాల్చుకుంటున్నాడు.

హరిని చూడగానే నాగేంద్రం బీడీ పారేసి నమస్క రించాడు వినయంగా.

"ఇన్నిరోజులుగాకన్పించలేదేం!" పలకరించాడు హరి.

నాగేంద్రం సమాధానంగా నవ్వుతూ, ఆడపిల్లల మధ్య పట్టుచీరలోవున్న అమ్మాయికేసి చూశాడు.

పట్టుచీరలో, నగలతో వున్న అనసూయను చూసి హరి ఆశ్చర్యపోయాడు. ఇన్ని నగలతో, ఇంత అలంక రణతో ఈ నిలయానికి ఎందుకు వచ్చిందో అర్థంకాలేదు. నాగేంద్రం ఏదో మాయమాటలు చెప్పి తీసుకొచ్చాడేమో అనుకున్నాడు.

"ఆ ముసలి నక్కకు ఎలా టోకరా ఇచ్చావోయ్!" అన్నది గాయిత్రి.

"ఇది నాకేం కొత్తా? ఇది నాలుగోసారి!" అనసూయ గర్వంగా చెప్పింది.

ఆ ప్రశ్నా, సమాధానం హరికి ఆశ్చర్యాన్ని కలిగిం చాయి. వారి సంభాషణ వింటూ నిల్చున్నాడు.

"ఆ చీరలో నగల్లో ఎంత బాగున్నావో తెలుసా ?" అన్నది సావిత్రి.

అనసూయ కళ్ళు ఓ క్షణం మెరిశాయి. అంతలోనే చీకటి తెరలు ఆ వెలుగును కప్పివేశాయి.

"అన్ని నగలూ ఇచ్చెయ్యకు జూకాలు వుంచుకో!" అన్నది చెవుల జూకాలకేసి ఆశగా చూస్తూ సుమతి.

"ఆ రాక్షసి ఇప్పుడు రాగానే అన్నీ వలిచేసుకోదూ!" అనసూయ కసిగా అన్నది.

"అవునే! నువ్వు పారిపోయి పదిరోజులైందిగదా! నాగేంద్రంతో ఎక్కడెక్కడ తిరిగొచ్చా వేమిటి ?

"బొంబాయిలోనే వున్నాం!"

"బొంబాయా! అదృష్టవంతురాలివి!"

"ఏం అదృష్టమే! పోలీసులు పట్టుకుంటే జైలుపాలు కావాలి. అది సరే గాని, ఆ ముసలినక్క మరి నన్ను వెతుక్కుంటూ రాలేదూ!"

"వచ్చాడు! నాన్నగారు వాణ్ణి బాగా బెదరకొట్టారులే. దాంతో చెమటలు కక్కుతూ పారిపోయాడు" కిల కిల నవ్వుతూ చెప్పింది అహల్య.

అనసూయ పకపకనవ్వింది.

"కొత్తవాళ్ళెవరైనా వచ్చారా ?" అడిగింది అనసూయ.

"ఒకేపిల్ల వచ్చింది. చాలా అందంగావుంది. చాలా అమాయకంగా కూడా వుంది. అందుకే ఆ అమ్మాయికి పెళ్ళి చెయ్యకుండా ఇక్కడే వుంచి వ్యాపారం చేస్తారను కుంటాను," అన్నది అహల్య.

హరి గతుక్కుమన్నాడు. ఆ మాటలు కాంతను ఉద్దే శించి అన్నవేనని గ్రహించాడు.

"పాతవాళ్ళంతా వున్నారా !"

"జరీనా, కమలా వెళ్ళిపోయారు."

"ఎక్కడికి ?"

"బొంబాయి వాళ్ళెవరికో అమ్మినట్టున్నారు, వ్యాపార కేంద్రానికే అనుకుంటాను." అన్నది గాయత్రి.

గేటులో కారు ఆగింది.

"నాన్నగారు ! నాన్నగారు !" అంటూ అందరూ లోప లకు వెళ్లారు.

నాగేంద్రం గేటు తెరిచాడు.

ఆనందబాబా, మిసెస్ వైకుంఠం లోపలకు వచ్చారు. వాళ్ళు లోపలకు రాకముందే హరి ఆఫీసు గదిలోకి వెళ్లాడు.

"ఏరా ! నాగూ ? ఇంతకాలం ఏంచేశారు ? ఎన్ని నగలు అమ్మేశావ్?" బాబా అడిగాడు నాగేంద్రాన్ని.

"అమ్మలేదండీ! కొంత డబ్బుకూడా తెచ్చింది. దాంతోనే ఎలాగో సర్దుకున్నాం. ఊళ్ళో మనిషికదా అని కొంచెం ఆలస్యంగా వచ్చాం!" అన్నాడు నాగేంద్రం.

"చూస్తాగా ?" అంటూ లోపలకు వెళ్ళాడు బాబా.

మిసెస్ వైకుంఠం అతన్ని అనుకరించింది.

నాగేంద్రం ఏదో గొణుక్కోవడం హరికి స్పష్టంగా వినిపించింది.

హరికి ఆఫీసురూంలో కూర్చోబుద్ధి కావడంలేదు. అనుకోకుండా కుర్చీలోనుంచి లేచాడు. హాల్లోకివచ్చాడు.

"మొత్తంనగలు అవేనా ?"

బాబా అడుగుతున్నాడు.

హరి వెనక నిల్చున్నాడు. ఎవరూ చూడలేదు.

"అవే !" కొంచెం మొండిగానే సమాధానం చెప్పింది అనసూయ.

"పదివేల ఖరీదుచేసే నగలు పెట్టుకెళ్ళావని ఆ ముసలాడు గోలపెట్టాడు ?" అన్నది మిసెస్ వైకుంఠం.

"అందుకు నన్నేం చెయ్యమంటారు ? నేను తెచ్చిన నగలు ఇవే," అన్నది అనసూయ.

"అన్నీ తియ్ చూద్దాం !"

అనసూయ ముఖం అదోలాపెట్టి ఒక్కొక్క నగ తీసి ఇచ్చింది, మిసెస్ వైకుంఠం ఒక్కొక్కటే అందుకొని ఆనందబాబాకు అందివ్వసాగింది.

"ఆ జూకాలు తియ్యవేం"' కసిరింది మిసెస్ వైకుంఠం.

ఏడుపుముఖం పెట్టి తీసింది.

"మరోసారి నేను ఈ పని చెయ్యను. ఇప్పుడే చెప్తున్నాను." జూకాలు విసురుగా మిసెస్ వైకుంఠం చేతిలో వదేసి అంతకంటే విసురుగా అన్నది.

ఆనందబాబా విస్మయంగా అనసూయ ముఖంలోకి చూశాడు.

మిసెస్ వైకుంఠం బాబా ముఖంలోకి అర్థయుక్తంగా చూసింది.

"ఇప్పటికి నాలుగు పెళ్ళిళ్ళు చేశారు. నాలుగుసార్లూ ఎన్నో నగలు పెట్టుకుని పారిపోయి వచ్చాను. నాకు వచ్చిందేమీలేదు, ఇకనేను మళ్ళీ చస్తే ఈ పని చెయ్యను."

"చెయ్యకు ఈసారి చేసుకున్నవాడి దగ్గిర బుద్ధిగా పడివుండు."

అన్నాడు బాబా.

"మళ్ళీ నేను ఎవర్నీ చేసుకోను. నాగేంద్రం నేనూ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. ఇక ఈ నీచపు బతుకు నాకు అక్కర్లేదు." ధైర్యంగా అన్నది అనసూయ

"వాడు చేస్తున్నది ఇదా ? ఒరేయ్ నాగూ ?" కోపంతో బుసలుకొడ్తూ వెనక్కు తిరిగిన బాబా హరిని చూశాడు.

వెంటనే మూడ్ మార్చుకున్నాడు.

*Deepavali Greetings*
*to all our Valued Clients & Well Wishers*

**GOLDEN PRESS**

**Gowliguda, Hyderabad. Phone: 44338**

*Specialists in*

Carton Printing, Box Making, Varnishing, and Quality Letter Press & Offset Printers.

"ఒరేయ్ నాగూ!" మెత్తగా పిల్చాడు.

"అనసూయను పెళ్ళిచేసుకుంటావా?"

నాగేంద్రం తల వంచుకున్నాడు.

"చూడవయ్యా హరీ! పెళ్ళనగానే ఎంత సిగ్గుపడిపోతున్నాడో? సరే? ఎల్లుండే మీ ఇద్దరికీ పెళ్ళి." నవ్వుతూ అన్నాడు బాబా.

"వద్దు బాబూ! దాన్ని నేను పెళ్ళి చేసుకోను."

అనసూయ చివ్వున తలెత్తి చూసింది.

బాబా కళ్ళు ఓ క్షణం మెరిశాయి. హరి ఆశ్చర్యంగా ఇద్దర్నీ మార్చి మార్చి చూశాడు. బాబా ఇష్టంతో ఆ మాట అనలేదని అతనికి తెలుసు.

"అదేమిటిరా! దానికి ఆశపెట్టి..."

"నేనేం ఆశపెట్టలేదు. నగలతో అది పారిపోతుందని అలా చెప్పాను. ఇంత చెడిపోయినదాన్ని నేను మాత్రం ఎందుకు చేసుకుంటాను." అన్నాడు.

"ఏమన్నావ్?" అంటూ బెబ్బులిలా ముందుకు దూకి నాగేంద్రం అ చెంపా ఈ చెంపా వాయించింది అనసూయ.

మిసెస్ వైకుంఠం అనసూయను లాక్కెళ్ళింది.

"చూశావా! ఇదీ వరస?" అంటూ బాబా బయటికి వచ్చాడు.

బాబా వెళ్ళిపోయాక హరి నాగేంద్రాన్ని అడిగాడు, "ఎందుకు ఆ అమ్మాయికి ఆశపెట్టి మళ్ళీ చేసుకోనన్నావ్? మీరంతా ఆడవాళ్ళ జీవితాలతో ఆడుకుంటున్నారు."

"మీకు తెలియదు బాబూ! అనసూయ అంటే నాకిష్టమే. బాబాకు ఎవరూ ఎదురు తిరగకూడదు. ఎల్లుండి పెళ్ళి అంటే—అది ఎలాంటి పెళ్ళో నాకు తెలుసు..."

మిసెస్ వైకుంఠం రావడంచూసి నాగేంద్ర అక్కడ నుంచి తప్పుకున్నాడు.

హరి ఆలోచనలో పడ్డాడు.

ఎంత ఘోరం! ఎంత అన్యాయం? అనాధ ఆశ్రమం అనీ, పతితల్ని ఉద్ధరిస్తున్నామనీ చెబుతూ వీళ్ళు చేస్తున్నది ఏమిటి? వ్యాపారం చేస్తున్నారు. ఆడవాళ్ళమీద డబ్బు సంపాదిస్తున్నారు. మనిషి మాంసం అమ్మి డబ్బు సంపాదిస్తున్నారు. అమాయకుల్ని ఉద్ధరిస్తున్నట్టు నటిస్తూ, వాళ్లను బజార్లో ఉప్పూ, చింతపండూ అమ్మినట్టు అమ్ముతున్నారు.

ఈ నిలయం గుట్టు బయటపెట్టాలి. బాబాకు మిసెస్ వైకుంఠానికీ బేడీలు తగిలించాలి.

శాంతనుకూడా అలాగే చేస్తారేమో? ఎందుకు చెయ్యరు? ఏమైనా సరే, శాంతను రక్షించాలి. ఒక్క శాంతనే కాదు ఈ నిలయంలో వున్న ఆడపిల్లలందర్నీ రక్షించాలి.

*With best compliments from:*

**KAMAT GROUP OF HOTELS**

**HYDERABAD.**

ఎలా? తనేం చెయ్యగలదు? పోలీసురిపోర్టు ఇవ్వాలంటే వీళ్లు చేస్తున్న అన్యాయాలను రుజువుచెయ్యాలి. అందుకు తను కొంత ఓపిక పట్టాలి. అదును చూసి అసలు గుట్టు బయటపెట్టాలి.

ఆ రోజంతా హరి అన్యమనస్కంగానే వున్నాడు.

## 11

శాంతకు నిద్రరావడం లేదు. అక్కడి విషయాలు చాలా వరకు అర్థంఅయ్యాయి.

తను ఎలాగైనా అక్కడినుంచి పారిపోవాలి ఎలా? అందరూ వెయ్యికళ్ళతో చూస్తూవుంటారు. పగలు ఇద్దరూ రాత్రి ఇద్దరూ వాచ్‌మెన్లు కాపలా కాస్తుంటారు. వాళ్ళను చూస్తేనే భయం వేస్తుంది.

"నిద్ర రావడం లేదా?" శాంత పక్కగా పడుకున్న గాయిత్రి అడిగింది.

"లేదు."

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

శాంత మాట్లాడలేదు.

"పారిపోవాలనేనా?"

శాంత ఆశ్చర్యంగా గాయత్రి ముఖంలోకి చూసింది.

"ఏమిటలా చూస్తావ్? నాకెలా తెలిసిందనేనా?"

"అవును! నా మనసులోని సంగతి నీకెలా తెలిసింది?" అమాయకంగా అడిగింది శాంత.

గాయిత్రి అదోలా నవ్వింది.

"మేమంతా ఇష్టంతో ఇక్కడ వుంటున్నామనుకుంటు న్నావా? వచ్చిన కొత్తలో నేనూ నీలాగే ఆలోచించాను."

"మరి ఎందుకు పారిపోలేదూ?"

"పారిపోయి ఎక్కడికెళ్తాను? మళ్ళీ ఇలాంటి వాళ్ళ చేతిలోనే పడాలిగా? ఇంతకంటే ఘోరమైన జీవితాన్ని గడపాల్సి వస్తుందేమో? ఈ దేశంలో ఇల్లు వదిలిన ఆడ దానికి రక్షణ ఎక్కడుంది?" అన్నది గాయిత్రి.

శాంత ఆలోచనలో పడింది. తను కావాలని ఇల్లువదల లేదే? ఇంట్లో, తల్లిదండ్రుల రక్షణలో వుండగానే తన బతుకు కాలిపోయింది. తాచుపాము కాటేసింది. తను చచ్చి పోవాలని ఇంటినుంచి పారిపోయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? పారిపోవాలనేనా? ఎక్క డకు వెళ్ళాలని?"

"తెలియదు."

గాయిత్రి విరక్తిగా నవ్వింది.

"ఇక్కడినుంచి పారిపోవడం అంత తేలికైన పని కాదు. ఆనందబాబా మనుషులు మనం ఎక్కడవున్నా పట్టితెస్తారు. ఆయన చాలా పెద్ద ముఠాకు నాయకుడు."

"నువ్వు వచ్చి ఎంత కాలం అయింది?"

"రెండు సంవత్సరాలు!"

"రెండు సంవత్సరాలా? అసలు ఎందుకొచ్చావ్?"

"దాదాపు మనందరి కథలూ ఒకలాంటివే. మా నాన్న గుమస్తా. బీద కుటుంబం. మేము ఐదుగురు ఆడపిల్లలం. నేనే పెద్దదాన్ని. వయసుకుతగ్గ కోరికలు నాలోనూ తలె త్తాయి. నాన్న నా పెళ్ళిమాటే తలపెట్టడం లేదు. ఒక దుర్మా ర్గుడి మాటలు నమ్మి రాత్రికి రాత్రి అతనితో వచ్చేశాను. పెళ్ళి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. ఓ నెల రోజులు నాతో హోటల్లోఉండి ఆ తర్వాత పారిపోయాడు. డబ్బు కట్టనందువల్ల హోటల్‌వాళ్లు నన్ను బయటికి నెట్టారు. ఎక్క డికి పోవాలో తెలియదు. ఎలా బతకాలో అంతకంటే తెలి యదు. నేను పెద్దగా చదువుకో లేదు. బిక్కుబిక్కుమంటూ స్టేషన్‌కు చేరుకున్నాను. నాగేంద్రం నన్ను ఈ నిలయానికి చేర్చాడు." అంటూ నిట్టూర్చింది గాయత్రి.

"నీ క్కూడా అనసూయకు చేసినట్టు పెళ్ళిచేశారా?"

"లేదు. మోసంచేసి పారిపోయివచ్చే తెలివితేటలు నాకు లేవట. అందుకని ఇక్కడే వుంచి మరో విధంగా నామీద డబ్బు సంపాదిస్తున్నారు."

"అంటే?"

"మరోనెల పోతే నీకే అర్థం అవుతుంది."

శాంత మౌనంగా వుండిపోయింది.

"శాంతా! హరి నిన్ను ఇక్కడకు తీసుకొచ్చాడు గదూ? అతను నీకెలా తెలుసూ?"

"శాంత తన విషయం దాచుకోకుండా చెప్పింది.

"హరి మంచివాడు." గాయిత్రి అన్నది.

"అవును! మంచివాడే!" శాంత మనసులోనే అనుకుంది.

మంచివాడు కాబట్టే తనను గౌరవంగా ఇక్కడ చేర్చాడు. తన తండ్రిలాంటి శేషాచలం ఏంచేశాడు?

శాంతకు తండ్రి గుర్తువచ్చాడు. తల్లి గుర్తువచ్చింది. వాళ్ళు తననుగురించి ఏమనుకుంటున్నారో? తను ఎవడితోనే వెళ్ళిపోయిందను కుంటున్నారేమో? అవమానంతో కృంగి పోతున్నారేమో? అమ్మ... అమ్మ ఇంకా బతికివుందా?

శాంత మనసులో ఏదో కలుక్కుమంది.

మాలతి ఏమనుకుంటుందో? మాలతికి పెళ్ళి అవుతుందా? మాలతి బతుకు ఏమౌతుందో? గాయిత్రిలాగే అది కూడా ఎవడితోనో వెళ్ళిపోయి... చివరకు ఈ నిలయానికే... శాంత ఆపైకి ఆలోచించలేకపోయింది.

ఛ! ఏమిటి తను ఇలా ఆలోచిస్తుంది?

ఇలా ఎందుకు జరుగుతుంది? డబ్బులేకేగా? తన నాన్నకూ డబ్బుఉంటే తను శేషాచలం ఇంటికి వంటచెయ్య

దానికి వెళ్ళేదా? చదువుకోవాలనే కోర్కె తనకు వుండేది. నాన్నకు డబ్బుంటే పెద్ద చదువులు చదివేది. ఉద్యోగం చేసేది. లేకపోతే ఎంత కట్నమయినా ఇచ్చి నాన్న మంచి సంబంధం తెచ్చేవాడు. తనూ పిల్లాపాపాతో హాయిగా కాపరం చేసుకొనేది.

డబ్బు! డబ్బు! అంతా డబ్బులోనే వుంది. ఈ డబ్బు కోసమే బాబాలాంటివాళ్ళు తనలాంటి ఆడపిల్లల జీవితాల్ని నాశనం చేస్తున్నారు. ప్రపంచంలో అసలు డబ్బు అనేదే లేకపోతే? దాని అవసరం లేకపోతే?

"ఏమిటి శాంతా ఆలోచిస్తున్నావ్?" అడిగింది గాయిత్రి.

"ఏమీ లేదు." అన్నది శాంత.

గాయిత్రి విరక్తిగా నవ్వింది.

"ఇవ్వాళ అనసూయ ఎదురు తిరిగింది. బాబా దాన్ని ఏంచేస్తారోనని భయంగా వుంది," అన్నది గాయిత్రి సాలోచవగా.

శాంత గాయిత్రి ముఖంలోకి చూసింది.

"ఇక్కడ ఎవరూ ఎదురు తిరక్కూడదు. ఎవరికీ నోరు వుండకూడదు మూగ పశువుల్లా వుండాలి. అనసూయను ఇక ఇక్కడ వుంచరు." మళ్ళీ గాయిత్రి అన్నది.

"వెళ్ళగొడ్తారా?"

"వెళ్ళగొట్టరు. అలా వెళ్ళగొడ్తే ఇక్కడి రహస్యాలు బయటపడ్తాయని భయం. అందుకే ఏ కాశింగాడికో చౌకగా అమ్మేస్తారు."

"కాశిం ఎవరు?"

"చార్‌మీనార్ దగ్గర్లో వాడు బ్రాతల్‌హౌస్ నడుపుతున్నాడు వాడి చేతిలోపడ్డ ఆడది తప్పించుకోలేదు. వాడు చూడటానికే భయంకరంగా కన్పిస్తాడు. పళ్ళ చక్రంకింద చెరుకుగడను పిండినట్టు ఆడదాని రక్తమాంసాలు పిండి చంపుతాడు."

శాంత భయంతో బిగుసుకుపోయింది.

"ఇదీ బ్రోతల్‌హౌస్ లాగే వుందిగా?"

"ఇది ఘరానా బ్రోతల్‌హౌస్. ఇక్కడ ఆడవాళ్ళమీద బాబా వేలు సంపాదిస్తాడు. కాశింలాంటివాళ్ళు పదీ పరకా సంపాదిస్తారు. అదే బేధం." గాయిత్రి కసిగా అన్నది.

గాయిత్రి ఆవలిస్తూ కళ్ళు మూసుకుంది.

శాంతకు నిద్ర రావడంలేదు. గాయిత్రి నిద్రపోయింది.

తను ఇక్కడ వుండకూడదు. పారిపోవాలి. ఎక్కడకు? తనకు అమ్మా నాన్నా ఉన్నారు.

తనకు ఇష్టంలేకపోతే ఇక్కడినుంచి వెళ్ళిపోవచ్చునని హరి చెప్పాడు. అది అబద్ధమేనా? అతను అబద్ధం ఎందుకు చెప్పాడు? అతనుకూడా...?


***With the Best Compliments from:***

## Nota Bene Enterprises & Prisma Sales

II-S-30, Lal Bahadur Stadium,
HYDERABAD-500 001.
Tel: 37409

REPUTED ELECTRICAL DEALERS

**Products handled :**

1. Loadster Miniature Circuit Breakers
2. Larsen & Toubro Switch Fuses, Starters Etc.
3. Essen Deinki Control Components
4. Sumeet Mixers
5. M-Seal Epoxy Compound
6. 'Schangler' PVC corrugated tubes
7. 'Unielec' Battery chargers

కాదు... అతను మంచివాడు. ఇక్కడి పరిస్థితులు ముందు అతనికి తెలిసివుండవు.

ఎలాగయినా అతని సహాయంతో ఇక్కడనుంచి పారి పోవాలి.

అమ్మా నాన్నా ఆదరిస్తారు. లేకపోతే ఆత్మహత్య చేసుకోక తప్పదు. ఈ బ్రతుకు కూడా ఒక బ్రతుకేనా? ఇంతకంటే చావే మేలు.

## 12

తెల్లవారేసరికి అనసూయ మాయం అయింది.

ఏమైందో ఎవరికీ తెలియదు.

అనసూయ గురించి పెద్దగా మాట్లాడే ధైర్యం కూడా ఎవరికీలేదు. ఇటువంటివి వారికి కొత్తకాదు.

"అనసూయ కన్పిచడం లేదేం?" శాంత గాయిత్రిని అడిగింది.

"ఉష్! ఇది మామూలే! రాత్రే చెప్పాగా? ఈ విషయం ఇంకెవరి దగ్గరా ఎత్తకు!" అన్నది గాయిత్రి.

గాయిత్రి ముస్తాబవుతూవుంటే "ఎక్కడికి వెళ్తున్నావ్?" అని శాంత అడిగింది.

"ఇంకెక్కడికి గెస్టుహౌస్‌కు"

"ఎందుకూ?"

గాయిత్రి విరక్తిగా నవ్వింది.

"రెండురోజులు పోతే నీకూ అర్థం అవుతుంది," అన్నది గాయిత్రి

శాంత గుండెలు దడదడ లాడాయి.

ఆ రాత్రి గాయిత్రి చాలా ప్రొద్దుపోయి వచ్చింది. శాంత గాయిత్రిని ఏమీ ప్రశ్నించలేదు. గాయిత్రి పడుకొని మౌనంగా ఏడవటం చూసింది శాంత. అయినా శాంత ఏమీ అడగలేదు.

రెండో రోజు మధ్యాహ్నం శాంత చిన్నగా ఆఫీసు గదిలోకి వచ్చింది.

హరి తలవంచుకొని రిజిష్టర్సు నుంచి ఏదో నోట్ చేసుకుంటున్నాడు. అలికిడి విని ఉలిక్కిపడ్డాడు.

శాంతనుచూసి స్థిమితపడ్డాడు. చేతిలో కాగితం జేబులో పెట్టుకున్నాడు.

"ఏమిటి ఇలా వచ్చావ్? మిసెస్ వైకుంఠంచూస్తే...?" శాంత ముఖంలోకి లోతుగా చూస్తూ అడిగాడు హరి.

"లేదు. బయటికి వెళ్ళింది. నన్ను ఎలాగయినా ఇక్కడ నుంచి పంపించండి."

హరి ఓ క్షణం శాంత ముఖంలోకి చూశాడు.

"ఇక్కడ ఎన్ని దారుణాలు జరుగుతున్నాయో మీకు తెలియదు."

శాంత ఆశ్చర్యంగా హరి ముఖంలోకి చూసింది.

"తెలుసా? తెలిసే నన్ను ఇక్కడ ఎందుకు చేర్పించారు" కటువుగా వుంది శాంత కంఠం.

"అప్పుడు నాకు తెలియదు."

"ఇక్కడ నేను వుండను. వెంటనే నన్ను పంపించెయ్యండి."

"ప్రయత్నిస్తాను. కాని ఎక్కడికెళ్తావ్?"

"మా ఇంటి కెళ్తాను."

"మీ అమ్మా నాన్నా రానిస్తారా? ఆ రోజే వెళ్తే పరిస్థితి వేరుగా వుండేది. ఆడపిల్ల ఇల్లు విడిచి ఒకసారి వచ్చేశాక మళ్ళీ ఇంట్లోకి రానిస్తారా? సాంప్రదాయం, పరువూ ప్రతిష్ట అంటే వున్నగౌరవం ఈ దేశంలో మానవత్వంమీద లేదు."

శాంత తలవంచుకొని నిల్చుంది.

"ఆడదాని పాతివ్రత్యాన్ని గురించి మాత్రమే ఉగ్గు పాలతో నీతిని రంగరించి పోస్తారు. అందుకే ఈనాడు ఈ దేశంలో ఆడదాన్ని ఉప్పు, చింతపండు కంటే చౌకగా మార్కెట్‌లో అమ్ముతున్నారు"

శాంత కళ్ళనిండుగా నీరు తిరిగింది.

"శాంతా!" హరి కంఠంలోని ఆత్మీయతకు చలించి పోయింది శాంత.

శాంత హృదయంలోని ఆనకట్ట తెగిపోయింది. ఒక్కసారిగా అణిచిపెట్టిన దుఃఖం పెల్లుబికింది. రెండు చేతులతో ముఖం దాచుకొని బావురుమంది,

హరి మౌనంగాచూస్తూ వుండిపోయాడు.

శాంత కొంతసేపటికి పైటతో ముఖం తుడుచుకుంది.

"శాంతా!" హరి దగ్గరకువచ్చి నిలబడ్డాడు.

శాంత ఎర్రబడ్డ కళ్ళతోచూసింది బేలగా.

"ఇప్పుడు మీ అమ్మా నాన్నా రానివ్వరు. నీ కాళ్ళమీద నువ్వు నిలబడే స్తోమత నీకు లేదు. వంటరిగావున్న ఆడపిల్లకు రక్షణ కలిగించే వాతావరణం ఇంకా మనకు ఏర్పడలేదు. ఇంతకంటే దారుణమైనవాళ్ళ చేతుల్లో చిక్కక తప్పదు."

శాంత అసహాయంగాచూస్తూ నిలబడింది.

"నీకు రక్షణ కావాలి. పెళ్ళి చేసుకుంటావా?"

శాంత తృళ్ళిపడింది. పెళ్ళా? అంటే బాబా చేసే పెళ్ళేనా?

"మాట్లాడు శాంతా!"

"బాబా చేసే పెళ్ళేనా?"

"కాదు."

శాంత ఆశ్చర్యంగా చూసింది.

"నన్ను మంచివాళ్ళెవరు చేసుకుంటారు?"

"నేను మంచివాణ్ణేనా?"

శాంత అవును! అన్నట్టు తల ఊపింది.

హరికి నవ్వొచ్చింది.

"మరి నన్ను చేసుకుంటావా?"

శాంత చివ్వున తలెత్తి చూసింది. నమ్మలేనట్టుచూసింది.

"ఏమిటలా చూస్తావ్?"

శాంత ఆలోచనలో పడింది. హరి తనను, చెడిపోయిన దాన్ని చేసుకుంటాడా? తనను ఎగతాళి చేస్తున్నాడేమో! ఆ భావం రాగానే శాంత కళ్ళలో నీరు ఉబికింది.

"నీకు ఇష్టం లేదా?"

శాంతకుహరి కంఠంలో నిజాయతీ వినిపించింది. కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళలో ఆదరణ కనిపించింది.

"నేను చెడిపోయినదాన్ని... నన్ను..." ఆగింది. ఆపై మాటలు పెగల్లేదు.

"నువ్వు చెడిపోయినదానివి కాదు. శేషాచలం చెడిపోయిన వాడు. ఆనందబాబా చెడిపోయినవాడు. మిసెస్ వైకుంఠం చెడిపోయింది. ఆ మాటకొస్తే ఈ నిలయంలోవున్న ఏ ఆడ పిల్లా చెడిపోయింది కాదు." హరి ఉద్రేకంగా అన్నాడు.

శాంత మంత్రముగ్ధలా చూస్తూ నిలబడింది.

సంతోషం— దుఃఖం... చిత్రమైన సమ్మేళనం— తమాషా అనుభూతి! శాంతకు గొంతు పెగల్డంలేదు.

"చెప్పు శాంతా! నామీద నీకు నమ్మకంలేదా?"

శాంత చటుక్కున పాదాలు పట్టుకోబోయింది.

హరి మధ్యలోనే ఆమెను రెండుచేతులతో పట్టుకున్నాడు.

"ఛ! ఏమిటిది? పాదాలు పట్టుకోవడం ఏమిటి? ఆడవాళ్ల ఇటువంటి ఫూలిష్ సెంటిమెంట్సు వదిలేస్తేగాని నిజమైన వ్యక్తిత్వాన్ని సంపాదించుకోలేరు."

వెనకనుంచి ఎవరో దగ్గారు.

హరి ఉలిక్కిపడి శాంతను వదిలేశాడు.

శాంత దూరంగా జరిగి నిల్చుంది. బాబాను చూసి వణికిపోతూ నిల్చుంది.

హరి ఓ క్షణం తడబడ్డాడు. అంతలోనే సంబాళించు కున్నాడు.

రాబోయే తుఫానును ఎదుర్కొనడానికి అనట్టు నిటారుగా నిల్చున్నాడు. నిర్భయంగా బాబా ముఖంలోకి చూశాడు.

బాబా చిరునవ్వు నవ్వుతున్నాడు.

హరికి ఆశ్చర్యం కలిగింది.

"ఏమిటి నువ్వు చేస్తున్నది. ఈ ఆవరణలో ఇటువంటివి జరక్కూడదని నీకు తెలియదా?" బాబా మృదువుగానే మందలించాడు.

"సారీ!"

"శాంత నీకు ముందే తెలుసుగదూ? నాకు చెప్పిన కథంతా అబద్ధమే కదూ?"


For all your requirements of Paper Bags, Polythene Bags, Butter Paper Bags & Envelopes

**Andhra Paper Bag Company**

**General Bazaar, Secunderabad - 500 003; Tel : 72749**

*Seasons Greetings & Best wishes from:*

**Mysore Paper Corporation**

General Bazaar, Secunderabad - 500 003; Tel : 72749

**Agents for :**

Sun Paper Company — Mfrs. of 'Lustre Cote' Art Paper, Art Card and Chromo paper. Rohit Pulp and Paper Mills Ltd., – Mfrs 'Peral Glow' Art Paper, Art Card, Chromo Paper, Bankers Ledger and White Maplitho. Mysore Paper Mills Ltd., – Mfrs. of 'Bison' brand **White and Kraft Paper.**

"లేదండీ! నేను అబద్ధం చెప్పలేదు. కాని నేను శాంతను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను."

బాబా నవ్వుతూ ముందుకు వచ్చి, హరి భుజం తడుతూ "భేష్! నీలాంటివాళ్లే నాకు కావాలోయ్ శాంత సంగతి తెలిసీ పెళ్ళిచేసుకుంటానంటున్నావ్. నిజంగా నీ సంస్కారాన్ని మెచ్చుకుంటూన్నాను."

"ఇందులో నా సంస్కారం ఏముందండీ? నాకూ ఒక భార్య కావాలి. శాంత నాకు భార్య అయితే సుఖపడతానను కుంటున్నాను. ఇందులో నా స్వార్థమేవుంది శాంత తప్పేమీ చెయ్యలేదు. ఆ మాటకొస్తే నేనే శాంతకు తగను ఒకప్పుడు నేను ఒక అమ్మాయితో తిరిగాను."

"నువ్వు మగవాడివి!"

"అవును! నేను మగవాడిని అందుకే నాలో చెడిపోయే పదార్థం ఏదీ లేదంటారు. ఆమె ఆడది కనుక, మరో పశుత్వానికి బలిఅయింది కనక ఆమె చెడిపోయింది అంతేనా?" ఉద్రేకంగా అడిగాడు హరి.

"నిన్ను చూస్తుంటే నాకు చాలా గర్వంగావుంది. చూడగానే నీలోని సంస్కారాన్ని, ఔన్నత్యాన్ని గుర్తించాను. అందుకే నిన్ను ఇక్కడికి తీసుకొచ్చాను. చాలా సంతోషంగా వుంది. ఎల్లుండే మీ పెళ్ళి. నువ్వు లోపలికెళ్ళమ్మా!" శాంతతో అన్నాడు బాబా.

శాంత ముఖం సిగ్గుతో జేవురించింది. తేలికపడిన మనసుతో అడుగులో అడుగు వేసుకుంటూ లోపలకు వెళ్ళి పోయింది

"మొత్తంమీద గట్టివాడివేనోయ్ మంచి పిల్లనే ఎంచుకున్నావ్ ఒకపిల్ల సమస్య తీరినా నాకు కొంత బరువు తగ్గినట్టేగా? మీ ఇద్దరూ సుఖంగా వుండటమే నాకు కావాల్సింది. కూర్చో! నీ పని చూసుకో." అంటూ బాబా బయటికి వచ్చాడు.

వాకిట్లో బయట నిల్చుని వారి సంభాషణ అంతా విన్న మిసెస్ వైకుంఠం బాబా కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూసింది.

బాబా చిరునవ్వు నవ్వి బయటికి నడిచాడు.

బాబాను అనుసరించిన మిసెస్ వైకుంఠం గేట్లో "ఏమిటిది? మీకు మతిపోయిందా ఏం? బంగారం లాంటి పిల్ల. దాన్ని జారవిడుచుకుంటే..." ఆగి బాబా ముఖంలోకి చూసింది

"నా తాపత్రయం తెలియదా?" అంటూ నవ్వాడు.

"హరి వాలకం కూడా నాకేం నచ్చలేదు. అతన్ని వదిలించుకోవడం మంచిది."

"ఇప్పుడు చేస్తున్నది అదేగా?" అని వెళ్ళి కారెక్కాడు ఆనందబాబా.

## 13

తెల్లవారి పదిగంటలకు మిసెస్ వైకుంఠం శాంతను పిల్చింది. కొత్త చీర ఇచ్చి కట్టుకోమంది. ఆ తర్వాత, చెవులకు జూకాలూ, మెళ్లో గొలుసూ, చేతులకు గాజులూ వేసింది.

అమ్మాయిలంతా ఆశ్చర్యంగా చూడసాగారు.

"ఏమిట్రా అట్లాచూస్తారు? రేపు మన శాంత పెళ్ళి. మన సెక్రెటరీగారికిచ్చి చేస్తున్నాం. ఆ మాత్రం నగలైనా పెట్టకపోతే ఎలా?" అంది మిసెస్ వైకుంఠం.

కొందరికి శాంత అంటే ఈర్ష్యకలిగింది.

కొందరికి ఇందులో కూడా ఏదో కుట్ర వుంది అనిపించింది.

గాయిత్రిమాత్రం సంతోషంగా శాంతనుకౌగలించుకుంది.

"నాకు చాలా సంతోషంగావుంది శాంతా! నువ్వైనా సుఖపడు!" ఆర్ద్రకంఠంతో అన్నది గాయిత్రి.

"రామ్మా! హరితో నువ్వు ఇవ్వాళ బయటికి వెళ్తున్నావ్," అన్నది మిసెస్ వైకుంఠం.

గాయిత్రి అర్థం కానట్టు చూసింది. శాంత విస్మయంగా చూసింది.

"అలా హరితో బజారుకు వెళ్ళి నచ్చిన చీర తెచ్చుకో. కొత్త కాపరానికి కావల్సిన వస్తువులు కూడా కొనుక్కో. అబ్బాయి కూడా బట్టలు కొనుక్కుంటాడు మళ్ళా త్వరగా వచ్చెయ్యండి," అన్నది మిసెస్ వైకుంఠం

శాంత చెక్కిళ్ళు చెవులదాకా ఎరుపెక్కాయి,

మిసెస్ వైకుంఠం శాంతను ఆఫీసు గదిలోకి తీసుకొచ్చింది.

హరి శాంతను చూశాడు. చూస్తూనే వుండిపోయాడు. నగలతో, కొత్త చీరలో శాంత ఎంతో అందంగా కనిపిస్తూ వుంది. ముఖంలో ఆనందం, కళ్ళలోని సంతృప్తి ఆమెకు కొత్త ఆకర్షణ కలిగించాయి

హరి శాంత నగలకేసి చూశాడు.

"ఆ నగలు ఎవరివండీ?" అన్నాడు.

"పెళ్ళికూతురు గదా అని నేనే పెట్టాను. రేపు పెళ్ళయాక తీసేస్తుందిలే." అన్నది మిసెస్ వైకుంఠం.

"డబ్బు జాగ్రత్త! ఈనెల జీతంతోపాటు మరో మూడు నెలల జీతం అడ్వాన్సుగా ఇచ్చాను. ఎందు కంత అభిమాన పడ్డావ్? వెళ్ళండి. నీకూ అమ్మాయికీ బట్టలు కొనుక్కోగా మిగిలిన డబ్బుతో కొత్త సంసారానికి అవసరమైన వస్తువులు కొనండి. త్వరగా వచ్చెయ్యండి." అన్నాడు బాబా,

శాంతా హరీ బయటికి వెళ్తుంటే నాగేంద్రం ఎదురు పడ్డాడు గేటులో. ఆశ్చర్యంగా ఇద్దర్నీ మార్చి మార్చి, తిరిగి తిరిగి, చూస్తూ లోపలకు నడిచాడు.

శాంత సిగ్గుపడుతూ హరి పక్కగా రిక్షాలో కూర్చుంది. సంతోషం— దుఃఖం... విచిత్ర భావసమ్మేళనం—

సంతోషానికి కారణం తెలుస్తూనేవుంది. దుఃఖానికి కారణం తెలియడం లేదు.

వాళ్ళు వెళ్ళగానే ఆనందబాబా ఫోన్ డయల్ చెయ్యసాగాడు.

## 14

"అంతా శ్రద్ధగా విన్నారా? అందరూ ఒకటిగానే, నేను చెప్పినట్టు చెప్పాలి. మీలో ఎవరు సరిగ్గా చెప్పకపోయినా కాశిం బ్రోతల్‌హౌస్‌కు వెళ్ళాల్సి వుంటుంది. తెలిసిందా ?" హెచ్చరించింది మిసెస్ వైకుంఠం.

అందరూ తలలు ఆడించారు.

గాయిత్రి మౌనంగా తలవంచుకొని కూర్చుంది.

"ఏయ్! గాయిత్రీ! ఏమిటే ఆ ఆలోచన? నేను చెప్పింది విన్నావుగా? తుచ– తప్పకుండా చెప్పాలి! జాగ్రత్త! పిచ్చిపిచ్చిగా మాట్లాడావో తాట వలిచేస్తాం. ఇక్కడ మందులూ, మాకులూ, మంచి తిండి, బట్టా దొరుకుతున్నాయి. రాజాలా గడిచిపోతుంది. క్లాసు మనుషులతో సంబంధాలు వుంటాయి. ఆ కాశింగాడి చేతుల్లో పడితే తెలుసుగా... పదీ-పరకాగాళ్ళు – రోగాలు – మందులు వుండవు – చివరకు పుచ్చి-కుళ్ళి ఛస్తారు." మిసెస్ వైకుంఠం చెబుతూవుంటే గాయిత్రి భయం భయంగా చూసింది

జీప్ వచ్చిన శబ్దం అయింది.

"వచ్చినట్టున్నారు. జాగ్రత్త. నేను చెప్పింది గుర్తుంచుకోండి." అంటూ మిసెస్ వైకుంఠం బయటికి వచ్చింది.

జీపు శబ్దం విని బాబా కూడా వరండాలోకి వచ్చాడు.

పోలీసు జీపు.

ఇద్దరు జవాన్లూ, ఒక ఇన్‌స్పెక్టరూ దిగారు.

ఏడుస్తూ శాంత దిగింది.

ఆ వెనక చేతులకు బేడీలతో హరి దిగాడు.



ఇన్‌స్పెక్టరు బాబాను విష్ చేశాడు. బాబా ప్రతి నమస్కారంగా చిరునవ్వు నవ్వి ఆఫీసు గదిలోకి నడిచాడు.

ఇదంతా బాబా ఆడిన నాటకం అని హరికి అర్థం అయింది. హరి బేడీలతో, కొత్తగా బంధించబడిన సింహంలా వున్నాడు.

అందరూ ఆఫీసుగదిలోకి వచ్చారు. శాంత వెక్కి వెక్కి ఏడుస్తూవుంది. హరి శాంతకేసి జాలిగా చూశాడు.

"నువ్వు ఆ అమ్మాయిని నగలతో లేపుకెళ్ళావు గదూ?" ఇన్‌స్పెక్టరు హరిని ప్రశ్నించాడు.

"అబద్ధం! అతనే మా ఇద్దరికీ పెళ్ళిచేస్తాననీ, బట్టలూ, కావాల్సిన వస్తువులూ కొనుక్కోమని గంట క్రితం బజారుకు పంపించాడు," హరి కోపంతో రొప్పుతూ అన్నాడు.

"నువ్వు ఆఫీసునుంచి డబ్బు కూడా దొంగిలించావు!"

"లేదు. బాబాయే ఇచ్చాడు. నాకు రావాలిసిన జీతంతో పాటు మరో మూడు నెలల అడ్వాన్సు కూడా ఇచ్చాడు."

"తప్పు నాయనా! అబద్ధం చెప్పకూడదు. చేసిన తప్పు ఒప్పుకుంటే సగం పాపం పోతుంది." అతి మృదువుగా అన్నాడు బాబా.

బాబా ముఖంలోకి ఏవగింపుగా చూశాడు హరి.

"నరరూప రాక్షసుడివి. నువ్వు చేసే దుర్మార్గాలు ఒకరోజు బయటపడకపోవు. ఇన్‌స్పెక్టర్‌గారూ! ఇంకా ఈ హోంలో అమ్మాయిలు వున్నారు. వాళ్ళను పిల్చి అడగండి," అన్నాడు హరి.

ముందు గాయిత్రిని పిల్చారు.

"శాంతను గంటక్రితమే హోంనుంచి బాబాగారు పంపించారా?" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

గాయిత్రి ఓ క్షణం మౌనంగా ఏడుస్తున్న శాంతను చూసింది.

"చెప్పవేం?" గద్దించింది మిసెస్ వైకుంఠం.

"అలా కోప్పడకు. చెప్పమ్మా!" బాబా అతి సౌమ్యంగా అడిగాడు.

హరి బాబా ముఖంలోకి చూశాడు. ఖాండ్రించి ఉయ్యాలనిపించింది.

"నీ పేరు?" ఇన్‌స్పెక్టరు అడిగాడు.

"గాయిత్రి."

"శాంతను నువ్వు చివరిసారిగా ఎప్పుడు చూశావు?"

"రాత్రి పడుకున్నప్పుడు."

శాంత చివ్వున తలెత్తి గాయిత్రి ముఖంలోకి చూసింది.

గాయిత్రి తలవంచుకొని నిల్చుంది.

హరి గాయిత్రిని ఆశ్చర్యంగా చూశాడు.

"ఆమె తర్వాత లేదని ఎప్పుడు గమనించావు?" ఇన్‌స్పెక్టరు ప్రశ్న.

"నిన్న సాయంత్రం అహల్యని అడిగి కొత్త చీర తీసుకొని కట్టుకుంది. తనకు ఊహ తెలిసినప్పటినుంచీ ఎప్పుడూ నగలు పెట్టుకోలేదనీ, ఒక్కసారి పెట్టుకోవాలని వుందనీ అన్నది. అహల్య తన నగలు పెద్దమ్మను అడిగి తీసుకొని శాంతకు పెట్టింది. రాత్రికూడా తియ్యలేదు. నా పక్కనే పడుకుంది. తెల్లవారు ఝామున గంట మోగింది. నేను లేచి చూస్తే పక్కన శాంత లేదు. త్వరగా లేచి వెళ్ళిందనుకున్నాను. ఆ తర్వాత ప్రార్థన సమయంలో కూడా కన్పించలేదు. అందరం వెదికాం. కాని ఎక్కడా కన్పించలేదు," గాయిత్రి గడగడా వల్లించిన పాఠం అప్పగించనట్టు చూసింది.

కొత్తగా అక్షరాలు నేర్చుకొంటున్న పసివాడు సంయుక్తాక్షరాలకేసి చూసినట్ట చూసింది శాంత గాయిత్రిని.

హరికి కోపం వచ్చింది. అంతలోనే గాయిత్రిమీద జాలి వేసింది. పాపం! ఏం చేస్తుంది? బాబా చెప్పమన్నట్టు చెప్పింది. ముఖం ఎంత చిన్నబుచ్చుకొని చెప్పిందో? దుఃఖం కూడా వస్తున్నట్టుంది. అనుకున్నాడు హరి.

"ఇక నువ్వెళ్ళొచ్చు."

గాయిత్రి పరుగులాంటి నడకతో బయటికి వెళ్ళిపోయింది.

ఇది గాయిత్రేనా? గాయిత్రి రూపంలోవచ్చిన పిశాచమా? ఇంతకుముందేగా తనను ముస్తాబు చేసి పంపించింది? తనను కౌలిగించుకొని ఎంత ఆప్యాయతను ఒలకపోసింది? ఈ కుట్రలో గాయిత్రికి కూడా భాగం వుంది.

అహల్య వచ్చింది.

"అవి నీ నగలేనా? ఆ చీర నీదేనా?"

"అవును!"

"ఆమెకు ఎందుకిచ్చావ్?"

"కొత్త చీర కట్టుకొని, నగలు పెట్టుకొని అద్దంలో తన రూపాన్ని ఒక్కసారి చూసుకోవాలని కోరిక వున్నట్టు చెప్పింది. నాకు జాలివేసింది. అందుకే ఇచ్చాను."

"ఆ నగలు నువ్వు రోజూ పెట్టుకుంటావా?"

"లేదు. ఇక్కడ ఎవరూ నగలు పెట్టుకోకూడదు. ఇక్కడకు రాగానే పెద్దమ్మ తీసి దాస్తుంది. మళ్ళీ మేము వెళ్ళిపోయే రోజు ఇస్తుంది."

శాంత స్థాణువులా నిలచిపోయింది.

హరి జాలిగా చూస్తూ వుండిపోయాడు.

"రాత్రి పడుకోబోయే ముందు ఎందుకు తీసుకోలేదు?"

"ఎక్కడికి పోతాయని అడగలేదు. ఒక్క రాత్రికి పెట్టుకుంటే ఏంపోతుందిలే అనుకున్నాను." అన్నది అహల్య.

"శాంతను చివరిసారి ఎప్పుడు చూశావ్?"

గాయిత్రి చెప్పినట్టే చెప్పింది అహల్య.

"అబద్ధం! అంతా అబద్ధం!" ఉన్నట్టుండి అరిచింది శాంత.

"నువ్వు నోరు మూసుకో!" అంతకంటే గట్టిగా అరిచింది మిసెస్ వైకుంఠం.

"అలా కోప్పడకు పాపం!" చాలా మృదువుగా అన్నాడు.

హరి కళ్ళకు బాబా మేకపిల్లను మింగబోతూ జాలి చూపించే తోడేలా కన్పించాడు.

ఆ తరవాత ఒక్కొక్కర్నీ పిలిచి అందరి స్టేట్‌మెంట్సు తీసుకున్నాడు ఇన్‌స్పెక్టరు.

కోర్టులో కూడా ఇలాగే చెప్పాలని అందర్నీ హెచ్చరించాడు.

"మీరు నోట్ చేసుకున్న నంబర్లు చూపించండి." ఇన్‌స్పెక్టర్ బాబాను అడిగాడు.

బాబా డైరీ తీసి చూపించాడు.

హరి జేబులో దొరికిన కరెన్సీనోట్ల నంబర్లతో పోల్చి చూసుకున్నాడు.

"కరెక్ట్" అన్నాడు బాబాముఖంలోకి చూస్తూ.

"మీ స్టేట్‌మెంటు ఇవ్వండి." అడిగాడు బాబాను.

"మీకు ఫోన్ చేసేముందే శాంత కనిపించడం లేదని మిసెస్ వైకుంఠంగారు ఫోన్‌చేస్తే వచ్చాను. నిన్న హరి శాంతతో ఏదో మాట్లాడడం చూశాను. ఆతనిమీదే అనుమానం వచ్చింది. పైగా అతను ఇవ్వాళ ఆఫీసుకు కూడా రాలేదు. నిన్ననే రేషన్ తెప్పించడానికి వెయ్యి రూపాయలు తెచ్చి షెల్ఫులో పెట్టాను. దాని'కి ఒకటి నా దగ్గిర వుంటుంది. చూస్తే డబ్బుకూడా లేదు. అందుకే మీకు రిపోర్టు ఇచ్చాను." అన్నాడు బాబా.

హరి బాబాముఖంలోకి కసిగా చూశాడు.

శాంత వెర్రిదానిలా చూసింది.

"వాళ్లు అబిడ్‌షాప్‌లో వున్నట్టు మీకెట్లా తెలిసింది?"

"నాగేంద్రం చూశాడు. చెప్పాడు." అన్నాడు బాబా.

"అబద్ధం! రెండుగంటలముందు ఈబాబాయేడబ్బిచ్చాడు. నాగేంద్రం నేను వెళ్తుండగా ఇక్కడే ఎదురైనాడు."

"రామ! రామ! తప్పు నాయనా! అబద్ధం ఆడకు. చేసిన తప్పు ఒప్పుకో," అంటూ వుండగానే హరి బాబా ముఖం మీద తుపుక్కున ఊశాడు.

బాబా మౌనంగా తుడుచుకున్నాడు.

"స్కౌండ్రల్! బాబా లాంటి సాధువుమీద ఊస్తావా?" చెయ్యెత్తాడు ఇన్‌స్పెక్టర్.

హరి చివ్వున తలెత్తి ఇన్‌స్పెక్టర్ ముఖంలోకి "కొట్టు చూస్తాను," అన్నట్టు చురచుర చూశాడు.

ఇన్‌స్పెక్టర్ ఎత్తిన చెయ్యి గాలిలోనే ఆగిపోయింది.

"తీసుకు పదండి!" జవాన్లకు పురమాయించాడు.

"చూడండి ఇన్‌స్పెక్టరుగారూ! చిన్నవాడు. మంచివాడే! ఏదో చిన్న తప్పుచేశాడు. పెద్ద శిక్ష పడకుండా చూడండి." అన్నాడు బాబా.

"మీలాంటి కరుణామూర్తులు వుండడంవల్లనే ఈదేశంలో ఈ మాత్రమైనా ధర్మం నడుస్తూ వుంది." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నాదేముంది బాబూ! మన దేశం ధర్మక్షేత్రం. ఎప్పటికైనా ఆ కృష్ణపరమాత్మ చెప్పినట్టు ధర్మానికే విజయం." అన్నాడు బాబా.


*Hearty Diwali Greetings from*

**VENKATESH PAPER MART**

WHOLESALE DEALERS IN PAPER & BOARDS OF ALL VARIETIES ON MOST COMPETITIVE RATES

**4-6-546, Esamiah Bazar, Hyderabad-500027.**

Phone : 5 1 8 2 8

హరి ముఖం ఉద్రేకంతో ఎర్రబడింది. బాబా గొంతు పిసకాలని పించింది.

"వెళ్లు నాయనా! మనదేశం ఒకప్పుడు మహా ప్రతివ్రతలను కన్న గడ్డ, ఈ పవిత్రభూమి మీద ఈనాడు పతితలు ఎక్కువైపోయారు. వాళ్ళను పాపకూపం నుంచి రక్షించడం మన ధర్మం!"

"ఛీ నోరుముయ్! వెళ్తాను! వెళ్తాను! కాని మళ్ళీవస్తాను, ఈ సారి ఒంటరిగా రాను. బేడీలతో అసలే రాను. ఒట్టి చేతులతోనూ రాను. ఈ ధర్మక్షేత్రాన్ని కురుక్షేత్రంగా మారుస్తాను.''

బాబా అదోలా నవ్వాడు.

''అంతా ఆ కృష్ణపరమాత్ముని లీల! సంభావామి యుగే యుగే అన్నాడు."

''జరగబోయే కురుక్షేత్రంలో కృష్ణపరమాత్మలు వుండరు. నీలాంటివాళ్లను రక్షించడానికి. ఆ సంగ్రామం రాజులు రాజుల మధ్య రాజ్యాలకోసం జరిగేది కాదు. దేవ దానవులమధ్య అమృతభాండంకోసం జరిగిన సంగ్రామం కాదు అది.

సాధు జంతువులకూ తోడేళ్లకూ మధ్య జరగబోయే సంగ్రామం!.

సాధు జంతువులు తిరగబడ్డ రోజు తోడేళ్ల బతుకు ఏమౌతుందో ఆలోచించుకో! చలి చీమలకు చిక్కిన విష నాగుల దుస్థితి గురించి ఒక్కసారి ఆలోచించు.

"దుబ్బుకూ, మానవత్వానికీ జరిగే ఆ సంగ్రామంలో విజయం మానవత్వానిదే నని గుర్తుంచుకో."

హరి ఉద్రేకంతో ఊగిపోతున్నాడు.

బాబా కళ్ళలో భయం నీడలా కదిలింది.

తడబాటును అణచుకుంటూ పేలవంగా నవ్వాడు.

"పిచ్చివాడా ? ఇదేం సినిమా కథ అనుకున్నావా ? జీవితం! హీరోలా మాట్లాడగానే సరిపోదు ! ప్రపంచాన్ని అర్థంచేసుకొని బ్రతుకు." అన్నాడు బాబా సాధ్యమైనంత సౌమ్యంగా.

"అవును! ఇది సినిమా కథ కాదు. అయితే ఈపాటికి మిమ్మల్నందర్నీ తలొక తన్నూతన్ని శాంతను అమాంతం ఎత్తుకుపోయి పెళ్ళిచేసేసుకొనేవాణ్ణే ! జీవితం కాబట్టే నా చేతులకు బేడీలు పడ్డాయి."

''ఏమిటోయ్ మహా ఎగురుతున్నావ్? పద! పద!" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

హరి శాంతను చూశాడు.

శాంత చెంపలమీదుగా కారుతున్న కన్నీరు గుండెల మీద వున్న పైటను తడుపుతూవుంది.

"శాంతా!" మృదువుగా పిల్చాడు.

శాంత కళ్లెత్తి దీనంగా హరిని చూసింది.

"భయపడకు. నేను తిరిగివస్తాను. నువ్వు ఎక్కడవున్నా ఏ పరిస్థితిలోవున్నా నిన్ను చేరుకుంటాను. నీతోపాటువున్న ఆ అమ్మాయిల్ని అబద్ధాలులు చెప్పారని అసహ్యించుకోకు. వాళ్ళ అసహాయతను అర్థంచేసుకో. వస్తాను."

హరి కాన్‌స్టేబుల్స్ వెనుక చకచక నడిచివెళ్ళాడు.

బాబాకు చెప్పి, ఇన్‌స్పెక్టరు బయలుదేరుతుంటే "విన్నావుగా అతని మాటలు ? ఇటువంటి కుక్కమూతి పిందెలు పెరక్కుండా మనం చూసుకోవాలి,'' అన్నాడు బాబా.

ఇన్‌స్పెక్టర్ సమాధానం ఇవ్వలేదు. నవ్వుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు.

పోలీస్ జీప్ దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

బాబా, మిసెస్ వైకుంఠం ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు.

"ఏమిటో వాగాడు? నాకు అర్థం కాలేదు.'' అన్నది మిసెస్ వైకుంఠం.

"వాడి ముఖం! వయసులో వున్నాడు. ఉద్రేకం వుంది."

"మహా అయితే ఏ ఆరునెల్లో శిక్షపడ్తుంది. ఆ తర్వాత మళ్ళీ..."

"వాడు మనల్నేం చెయ్యగలడు? దుష్టసంహారం చేసి ధర్మాన్ని నాలుక్కాళ్ళమీద నడిపించడానికి వీడేం అవతార పురుషుడా?" అన్నాడు బాబా.

'సాధు జంతువులు తిరగబడ్డ రోజు తోడేళ్ళ బతుకు ఏమౌతుందో ఆలోచించుకో.' హరి కంఠం బాబా చెవుల్లో ఖంగున మ్రోగింది. అతని గుండెల్లో చలికుదుపులా భయం కదిలింది.

"సరి! సరి! నువ్వెళ్ళి నీపని చూసుకో," అన్నాడు మిసెస్ వైకుంఠంతో విసుగ్గా.

"ఏమిటే అలా నిలబడ్డావ్? పద లోపలకు? ఆ నగలు తియ్. ఆ కొత్త చీర మార్చి పాతచీర కట్టుకో!" విసురుగా చెప్పింది మిసెస్ వైకుంఠం శాంతతో.

గాయిత్రి పరిగెత్తుకుంటూ వచ్చి శాంతను కౌగలించుకొని నిండుకుండ బద్దలైనట్టు భోరున ఏడవసాగింది.

Printed and Published by A. Chandrasekhar Rao at 5-9-88, Public Garden Road, Hyderabad.
o fr YUVA Publications and Printed at Dolton Press, Hyderabad 500001. Editor A. SUDHAKARA RAO